


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 115 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 7 మార్చి 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 115 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 7 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

- ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్
- యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ
- ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'
- హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసిన అమెరికా సబ్‌మెరైన్
- యుద్ధం దెబ్బకు 90 డాలర్లకు చేరిన ముడిచమురు ధరలు

- మిగతా 2లో



## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

- అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు
- కొన్ని దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయన్న మసూద్ పెజెష్కియాన్
- ఇజ్రాయెల్ పైకి అత్యాధునిక ఖోరంషహర్-4 క్షిపణుల ప్రయోగం
- ఇరాన్ నేవీని నామరూపాల్లేకుండా చేశామన్న అమెరికా
- భారీ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై విరుచుకుపడ్డ బి-2 బాంబర్లు

- మిగతా 2లో





## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు

- కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్ రావు విమర్శలు
- గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయని వెల్లడి
- రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను నడిరోడ్డుపైకి తెచ్చారని ఆగ్రహం
- పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పాకులాడుతున్నారని మండిపాటు

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు.గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల

- మిగతా 2లో

## అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయను

- అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదన్న ముఖ్యమంత్రి
- మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ
- మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్ పెన్ పవర్:అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయనని, అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకో పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామని అన్నారు.తాను ముఖ్యమంత్రి అయ్యాక రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే సన్న బియ్యం ఇచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఫామ్ హౌస్‌లో పడుకునే వారికి పేదవారి కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. మన ప్రాంతాన్ని మనం అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అందర్నీ కలుపుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో భూమి ఉంటే కోటీశ్వరులేనన్న సీఎం.. కొత్వాల్ గూడలో ఎకో పార్క్ ప్రారంభం



**రంగారెడ్డి: పెన్ పవర్:** కొత్వాల్ గూడలో నవీణూా నిర్మించిన ఎకో పార్క్‌ను సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం (మార్చి 6, 2026) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకో పార్క్ ను చూస్తే మనకు ఆకలేయదని చెప్పారు. ఎకో పార్క్‌ను నవీణూా అంత అద్భుతంగా తీర్చిదిద్దిందని సీఎం కొనియాడారు. హైదరాబాద్, రంగారెడ్డి కంటే బెస్ట్ నగరాలు మరొకటి లేవని తెలిపారు. మంచి ప్రభుత్వాలు ఉంటే ప్రపంచంతో పోటీ పడేలా అభివృద్ధి చేయొచ్చని సీఎం చెప్పారు. హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులు ఇకపై ఎకో పార్క్?కు వస్తారని సీఎం ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లాలో భూమి ఉంటే కోటీశ్వరులని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్‌లో ఎన్నో అద్భుత కట్టడాలు ఉన్నాయని,

- మిగతా 2లో



## రెవెన్యూ-అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం

- మిగతా 2లో



## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

- అంబర్ పేట ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో అడ్డంకులు
- సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్న కిషన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరిన కేంద్ర మంత్రి

- మిగతా 2లో



## రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- శుక్రవారం టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 11,129 మెగావాట్ల లోడ్
- గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో ఎం డల తీవ్రత పెరగడంతో పాటు రబి పం టల సాగు వేగం పెరగడం వల్ల విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. వ్యవసాయ అవసరాలకు తోడు గృహ, వాణిజ్య మరియు పారిశ్రామిక రంగాల్లో వినియోగం పెరగడంతో

- మిగతా 2లో

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో వందలాది చిన్నారులు మృతి

### యూనిసెఫ్ ఆందోళన

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 181 మంది చిన్నారులు మృతి
- లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి
- వెల్లడించిన ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ యూనిసెఫ్



పెన్ పవర్ డెస్క్:అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్‌లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్‌లో 181 మంది, లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం,

- మిగతా 2లో

## వైద్య విద్య అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం వైద్య విద్యకు పెద్దపీట వేసిందని పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ గడ్డం, వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట ప్రాంతంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేఖ, జగతీ దేవి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..


- మిగతా 2లో

## ఈ నెలాఖరు నాటికి నక్సలిజం పీడ విరగడవుతుంది

- దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందన్న అమిత్ షా
- సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్లపై ప్రశంసలు
- ఆయుధాలు పట్టే వారికి ఆయుధాలతోనే సమాధానం ఇస్తామని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఒడిశాలోని కటక్‌లో జరిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)

- మిగతా 2లో






## వెలుగుమట్లలో కన్నీటి కథ!

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిన ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న భూదాన్ భూములు. బుల్డోజర్ అనే పదం కేవలం యంత్రాన్ని సూచించడం కాదు అది పాలనా విధానంపై ప్రశ్నగా మారింది. ఖమ్మం నగరం శివారు లోని వెలుగుమట్లలో ఫిబ్రవరి 26 న ఇస్తి రక్షణ అనే వాదనను ముందుకు తస్తే మరోవైపు పేదల విధాన హక్కు అనే మౌలిక ప్రశ్నను లేవనెత్తింది. ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న కుటుంబాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల వారు అధికంగా ఉన్నారన్న అంశం. బుల్డోజర్ గోడలను మాత్రమే కూల్చగలవు. కానీ ప్రజల నమ్మకాన్ని కూల్చితే తిరిగి నిర్మించడం కష్టం. ఖమ్మం వెలుగుమట్ల ఘటనను కేవలం పరిపాలనా చర్యగా కాకుండా చట్టపాలన సామాజిక న్యాయం మధ్య సమతుల్యంగా చూడాలి. వెలుగుమట్ల గ్రామ శివారులో సర్వే నంబర్లు 147, 118, 149లకు సంబంధించిన భూదాన్ భూముల విషయం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశంగా తీసుకుని భూదాన్‌భూములు సాధారణంగా భూమిలేని పేదలకు పంపిణీ చేయబడితే పట్టాదారు పుస్తకాల్లో అవి భూదాన్ భూములుగానే నమోదుగా ఉంటాయి. స్థానికంగా అందుబాటులోనున్న సమాచారం ప్రకారం ఈ భూములు గతంలో నిరుపేదలకు కేటాయించినట్లు తెలుస్తుంది. దాదాపు కొన్ని ప్లాట్లుగా విభజించి నివాస అవసరాలకు వినియోగంలోకి వచ్చినట్లు ప్రస్తావనలు ఉన్నాయి. కేటాయింపులపై న్యాయస్థానాల్లో విచారణ జరిగి హైకోర్టు స్థాయిలో కూడా పరిశీలనలు జరిగినట్లు చెప్పబడుతోంది. ఇలాంటి పరిస్థితిలో ప్రస్తుత రికార్డుల స్థితి పూర్వనిర్ణయాల అమలు స్థాయి ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూములపై ఇళ్లను కూల్చివేస్తున్న ఘటన స్థానికంగా ఉద్రిక్తతలకు దారితీస్తోంది. పునరావాసం కల్పించకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం సరైందా? అనే ప్రశ్న అక్కడి ప్రజల మనసుల్లో తీవ్రంగా మ్రోగుతోంది. ఏళ్ల తరబడి నివసిస్తూ చిన్నచిన్న గుడిసెలను నిర్మించుకుని జీవిస్తున్న కుటుంబాలు ఒక్కసారిగా ఆశ్రయం కోల్పోవడం హృదయ విదారకంగా మారింది. వెలుగుమట్ల భూదాన్ పొలాల్లో నివసిస్తున్నవారు ఎక్కువగా దినసరి కూలీలు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారు. వారికి ఆ భూమి కేవలం మట్టికాదు అది జీవనాధారం, భద్రత, పిల్లల భవిష్యత్తు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయిస్తే, ముందుగా ప్రత్యామ్నాయ స్థలం లేదా పునరావాస పథకం ప్రకటించడం మానవతా ధర్మం. కానీ ప్రజల వాదన ప్రకారం స్పష్టమైన పునరావాస హామీ లేకుండానే కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. భూమి స్వాధీనంపై చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో పారదర్శకత ప్రజలతో చర్చ అవసరం. స్థానికులు చెబుతున్నదేమిటంటే సరైన నోటీసులు ఇవ్వకుండానే లేదా చర్చించకుండానే అధికారులు చర్యలకు దిగారని దీనివల్ల మహిళలు, పిల్లలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొన్ని కుటుంబాలు తాత్కాలికంగా బంధువుల ఇళ్లకు వెళ్లగా, మరికొన్ని కుటుంబాలు రోడ్లపైనే ఉండే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో భూమిని అవసరమని భావిస్తే, అది ప్రజల ప్రయోజనాల కోసమే కావాలి. కానీ అభివృద్ధి ప్రయోజనాలు పేదల ప్రాణాధారాన్ని నాశనం చేస్తే అది సమగ్ర అభివృద్ధి కాదని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పునరావాసం లేకుండా కూల్చివేతలు జరగడం రాజ్యాంగంలో ఉన్న సమానత్వం, జీవన హక్కు వంటి మూల్యాలకు విరుద్ధమని కొందరు న్యాయనిపుణులు సూచిస్తున్నారు. వెలుగుమట్ల ఘటన సామాజిక న్యాయంపై పెద్దచర్చకు దారితీస్తోంది. పేదల సమస్యలను ముందుగానే పరిష్కరించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించాలి. పునరావాసం, పరిహారం, ప్రత్యామ్నాయ గృహాలకల్పన వంటి అంశాలు స్పష్టంగా ప్రకటించి అమలు చేయడం అత్యవసరం. లేకపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ప్రజలతో చర్చించి, తగిన పునరావాస చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భూమి స్వాధీన ప్రక్రియ చట్టబద్ధంగా, పారదర్శకంగా, మానవీయంగా జరగాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అభివృది, మానవ హక్కులు కలిసి నడవాలి గానీ ఒకటి మరొకటిని తుంచకూడదు. వెలుగుమట్లలో జరుగుతున్న ఈ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పునరావాసం లేకుండా భూమి స్వాధీనం సరైందా? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు అధికార యంత్రాంగం పైనే ఉంది. పేదల కన్నీళ్లకు తుడిచే చర్యలు తీసుకుంటేనే సమాజంలో న్యాయం నిలబడుతుంది. ం

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో వందలాది చిన్నారులు మృతి

- మొదటి పేజి తరువాయి

విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్‌లో మొదటి రోజు ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.

## ఈ నెలాఖరు నాటికి నక్సలిజం పీడ విరగడవుతుంది

- మొదటి పేజి తరువాయి

57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం మావోయిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న 'తిరుపతి నుంచి పశుపతి' వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించాలనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు. నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కృషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ట వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరించారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హోం మంత్రి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మావోయిజం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోందని అమిత్ షా వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు వేగంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ఆ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధికి చిహ్నాలుగా మారుతున్నాయని, గిరిజన బిడ్డలకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# రెవెన్యూ-అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మొదటి పేజి తరువాయి

జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

**సాంకేతిక లోపాలు సరిదిద్ది, బాధ్యతను నిర్వర్తించాలి..**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు..**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు, రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ..**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు, చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకు భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ..**

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో భూమి ఉంటే కోటీశ్వరులేనన్న సీఎం..
## కొత్వాల్ గూడలో ఎకో పార్క్ ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

కబ్జాలతో నగరాన్ని నాశనం చేశారని సీఎం గత పాలకులపై మండిపడ్డారు. హైదరాబాద్ ఇప్పుడు చెత్తతో నిండిపోయిన నగరం అంటున్నారని, నగరాన్ని బాగు చేద్దామంటే కొంత మంది అడ్డుపడుతున్నారని సీఎం ఆరోపించారు. మూసీ పక్కన బతకాలని ఏ కుటుంబం కోరుకోదని రేవంత్ రెడ్డి చెప్పారు. ఐదేండ్లలో శంషాబాద్ నుంచి బెంగళూరుకు బుల్లెట్ ట్రైన్ వస్తదని, బుల్లెట్ ట్రైన్ ఎక్కితే రెండున్నర గంటల్లోనే ముంబై పోవచ్చని సీఎం వివరించారు. ప్రపంచంలో గొప్ప నగరాన్ని ఇక్కడ నిర్మిస్తున్నామని, అమెరికాకు చెందిన పెద్ద పెద్ద సంస్థలతో మాట్లాడుతున్నామని స్థానికులకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

**ఎకో పార్కు ప్రత్యేకతలు ఇవే:**

హిమాయత్ సాగర్ సమీపంలో 85 ఎకరాల్లో ఎకో పార్కును అభివృద్ధి చేసిన హెచ్‌ఎండీఏ
రూ. 75 కోట్లతో ఎకో పార్కును నిర్మించిన హెచ్‌ఎండీఏ
ఎకో పార్కులో ప్రత్యేక ఆకర్షణగా దక్కన్ బర్డ్ సఫారీ పార్క్
ఐదు ఎకరాల్లో 6 వేల 500 వివిధ రకాల పక్షులతో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బర్డ్ పార్క్
బర్డ్ పార్క్?లో 4 ఖండాల నుంచి 40 రకాల విదేశీ పక్షులు
ఎకో పార్క్?లో 1.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ వాక్ వే
మార్చి 7, 2026 (శనివారం) నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్న ఎకో పార్క్

## రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- మొదటి పేజి తరువాయి

విద్యుత్ డిమాండ్ రోజురోజుకు రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ నెల 3వ తేదీన రాష్ట్రంలో మొత్తం విద్యుత్ డిమాండ్ 18,139 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు నమోదు చేసింది. అదే సమయంలో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో శుక్రవారం గరిష్ట డిమాండ్ 11,129 మెగావాట్లు నమోదైంది. గత ఏడాది ఇదే రోజున ఈ డిమాండ్ 10,310 మెగావాట్లుగా ఉండగా, ఈసారి అది గణనీయంగా పెరగడం విశేషం.

**గ్రేటర్ పరిధిలోను భారీగా పెరిగిన డిమాండ్**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ నెల 3న అక్కడ 4,421 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైంది. రబీ పంటల సాగు కొనసాగుతున్న జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో పాటు ఎండల కారణంగా గృహ వినియోగం కూడా పెరుగుతోంది. జిల్లాల వారీగా కూడా డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గరిష్ట డిమాండ్ 2,459 మెగావాట్లు నమోదవగా, మహబూబ్‌నగర్ జిల్లాలో 2,326 మెగావాట్లు, మెదక్ జిల్లాలో 2,181 మెగావాట్లు నమోదయ్యాయి.

**నిరంతర సరఫరాకు అన్ని చర్యలు**

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నిరంతర సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి. పాటిల్ తెలిపారు. 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడును నిరంతరం పర్యవేక్షించాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

# వైద్య విద్య అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎంపి. నిధుల నుండి 2 బస్సులు, డి. ఎం. ఎఫ్. టి. నిధుల నుండి 1 బస్సు మొత్తం రూ.80 లక్షల నిధులతో కేటాయించడం జరిగిందన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వైద్య విద్య అభ్యసిస్తున్నారని, వైద్య విద్య అనేది ప్రత్యేకమైనదని తెలిపారు. చదువుకోవడం అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ఉన్నత చదువులు అభ్యసించి ఆదర్శంగా నిలవాలని, ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవ అందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. గడిచిన 2 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండం, బెల్లంపల్లి, రేచిని ఇతర ప్రాంతాల్లో ఓవర్ బ్రిడ్జిలు, ఇతర అభివృద్ధి కొరకు అనుమతులు పొంది పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.

**మంచిర్యాల ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలి**

రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తూ అనేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు నిలుపడం ద్వారా రైల్వే శాఖకు ఈ ప్రాంతం నుండి అధిక ఆదాయాన్ని సమకూరుతుందన్నారు. విద్యారంగాన్ని పటిష్ట పరిచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో చదివి దేశంలో మంచిర్యాల ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని, తద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. విద్యార్థుల కొరకు త్వరలోనే స్పోర్ట్స్ కిట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**సమాజానికి సేవలు అందించాలి**

అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాల కోసం నూతన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 1 వేయి మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. వైద్య విద్య కొరకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్, మెటీరియల్, ఫ్యాకల్టీ ఇతర అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమైన బస్సు సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఇటీవల వరుసగా జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కారణంగా ఆలస్యం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్య విద్య ఎంతో ఖర్చుతో కూడుకుందని, అర్హత గల విద్యార్థులకు ప్రభుత్వం విద్య అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య విద్యను పూర్తి చేసి సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్.ఓ.డి శ్రీకాంత్, ఎ.డి. తులసీదేవి, డి.సి.సి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులుండ

లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుద్ధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గత ఏడాది మే నెలలోనే ఈ ఫ్లై ఓవర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించినప్పటికీ, కింద సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కిషన్ రెడ్డి తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయినా, భూసేకరణలో జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు పనులు నిలిచిపోయాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించి రూ. 2.54 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించినప్పటికీ, కొన్ని శక్తులు అడ్డుతగులుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 2014 నుం ఇప్పటి వరకు 2,800 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించామని... అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపి, జీహెచ్‌ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు "కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి" అని ఆయన శుక్రవారం ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

**కొనసాగుతున్న ఇరాన్ ప్రతీకారం**

అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా.. క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన 'ఖొర్రమ్‌షహర్-4' బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నిమ్ వార్తా సంస్థ వెల్లడించింది. "ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4"లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.

**విరుచుకుపడుతున్న అమెరికా 'ఎపిక్ ఫ్యూరీ'**

మరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. "మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఇరాన్‌కు భారీ నష్టం: అమెరికా ప్రకటన**

ఈ ఆపరేషన్ ఆరో రోజుకు చేరుకుందని, ఇరాన్ మిలటరీ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు.

గత 72 గంటల్లో టెహ్రాన్ పరిసరాల్లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్లు దాడులు చేశాయి.

భూగర్భంలో దాచిన క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసేందుకు బీ-2 బాంబర్ల ద్వారా 2000 పౌండ్ల బాంబులను జారవిడిచారు.

ఇప్పటివరకు 30కి పైగా ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచేశారు. ఇందులో రెండో

ప్రపంచ యుద్ధ కాలం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ పరిమాణంలో ఉన్న ఓ భారీ డ్రోన్ క్యారియర్ షిప్ కూడా ఉందని, అది ప్రస్తుతం మండుతోందని కూపర్ తెలిపారు.

అమెరికా దాడుల ఫలితంగా ఇరాన్ నుంచి వచ్చే బాలిస్టిక్ క్షిపణి దాడులు 90 శాతం, డ్రోన్ దాడులు 83 శాతం తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు.

ఇరాన్ స్పేస్ కమాండ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా దెబ్బతీశామన్నారు.

కేవలం ఇరాన్ దగ్గర ఉన్న ఆయుధాలను ధ్వంసం చేయడమే కాకుండా.. భవిష్యత్తులో వారు తిరిగి కోలుకోలేనంతగా క్షిపణి తయారీ పరిశ్రమను నేలమట్టం చేయడమే తమ తదుపరి లక్ష్యమని అమెరికా స్పష్టం చేసింది.

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

## గత ఎన్నికల్లో మాటలు, మూటలతో గెలవలేదు.. చిత్తశుద్ధితో పోటీచేసి.. ప్రజలు మద్దతుతో గెలిచాం





**హైదరాబాద్ పెన్ పవర్:**గత ఎన్నికల్లో మాటలు, మూటలతో గెలవలేదు.చిత్తశుద్ధితో పోటీ చేసి ప్రజల మద్దతులో గెలిచామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని విమర్శించారు.. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని ..కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. శుక్రవారం (మార్చి6) హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సీఎం రేవంత్ రెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో సీఎంరేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న తొలి రాష్ట్రం మనదేనన్నారు సీఎం. మాదిగల సమస్యలు పరిష్కరించడం పెద్ద సమస్యలను కాదు.. కానీ వెనుక నుంచి కుట్రలను మీరే అడ్డుకోవాలన్నారు. మాదిగ జాతి ఇంకా వెనుకబాటు తనం అనుభవిస్తున్నది, వెనకబాటు తనం పోవాలంటే చదువే పరిష్కారం

అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. భూములు పంచలేం కానీ చదువు చెప్పిస్తామన్నారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇచ్చామన్నారు. రేషన్ కార్డు ఉంటేనే బియ్యం, ఉచిత కరెంట్ వస్తుందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నామన్నారు.

## ఆంధ్రా బ్యాంకును మోసగించిన కేసు... రూ.26.86 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ




- బ్యాంక్ మోసం కేసులో సౌభాగ్య ఇస్పాత్ సంస్థపై ఈడీ కొరడా
- హైదరాబాద్ జోనల్ ఆఫీస్ ద్వారా రూ.26.86 కోట్ల ఆస్తుల అటాచ్
- ఆంధ్రా బ్యాంక్ నుంచి నకిలీ పత్రాలతో భారీగా రుణాలు
- నిధుల మళ్లింపు కోసమే తప్పుడు రికార్డుల సృష్టి
- రికవరీ కాని మొత్తానికి సరిపడా ఆస్తులను జప్తు చేసిన అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్యాంకు రుణాల మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ అధికారులు కీలక చర్యలు చేపట్టారు. సౌభాగ్య ఇస్పాత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఐఐపీఎల్) కంపెనీకి చెందిన రూ.26.86 కోట్ల విలువైన స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జప్తు చేసిన ఆస్తుల్లో ప్లాట్లు, ఇళ్లు, ఇతర స్థలాలు ఉన్నట్లు ఈడీ తెలిపింది. ఆంధ్రా బ్యాంకు (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను మోసగించి, బ్యాంకుకు నష్టం కలిగించారన్న అభియోగంపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. స్టీల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు, విస్తరణ పేరుతో కంపెనీ డైరెక్టర్లు, ఇతర నిందితులు బ్యాంకు నుంచి టర్మ్ లోన్లు, వర్కింగ్ క్యాపిటల్ తీసుకున్నారు. అయితే, అర్హత కంటే ఎక్కువ రుణాలు పొందేందుకు నకిలీ స్టాక్ స్టేట్‌మెంట్లు, తప్పుడు ఆర్థిక నివేదికలు, ఫోర్జరీ పత్రాలను బ్యాంకుకు సమర్పించినట్లు విచారణలో తేలింది.తీసుకున్న రుణాలను వ్యాపార అవసరాలకు వాడకుండా.. ఇతర మార్గాల్లో దారి మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. సంబంధిత సంస్థల ద్వారా లావాదేవీలు జరిపినట్లు రికార్డులు సృష్టించి, కంపెనీ టర్నోవర్‌ను కృత్రిమంగా పెంచి చూపించారు. ఇలా మోసపూరిత మార్గాల ద్వారా సుమారు రూ.46.52 కోట్ల మేర నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో బ్యాంకు ఇప్పటికే రూ.15.52 కోట్లను రికవరీ చేసింది. మిగిలిన మొత్తానికి సంబంధించి.. ప్రస్తుతం మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద రూ.26.86 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

## అల్లు శిరీష్ వివాహానికి హాజరైన సీఎం రేవంత్

- అల్లు అరవింద్ ఇంట మోగిన పెళ్లి బాజా
- ప్రేయసి నయనిక మెడలో తాళి కట్టిన అల్లు శిరీష్
- నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్ రెడ్డి
- కొల్లూరు ఐనా ఈవెంట్ స్పేస్‌లో ప్రైవేట్‌గా వివాహ వేడుక
- కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో పెళ్లి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రేయసి నయనికతో శిరీష్ వివాహం ఈ శుక్రవారం (మార్చి 6, 2026) సాయంత్రం కన్నుల పండుగగా జరిగింది. హైదరాబాద్‌లోని కొల్లూరు ఐనా ఈవెంట్ స్పేస్ వేదికగా జరిగిన ఈ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అల్లు శిరీష్, నయనిక జంటకు సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధూవరులు, అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో కలిసి సీఎం ఫోటోలు దిగారు. వధూవరులను

-4లో

## నల్లచెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కూకట్‌పల్లి నల్ల చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం నల్లచెరువును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. సభా ప్రాంగణం ఎక్కడ ఏర్పాటు చేయాలి..? సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ స్టాళ్లను ఎక్కడ పెట్టాలి అనే అంశాలను ఇతర శాఖల అధికారులతో పరిశీలించారు. ఎంతమంది వస్తారు.. వారికి సీటింగ్ ఏర్పాట్లు ఎలా ఉండాలి అనే అంశాలను సమీక్షించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఒకప్పుడు కూకట్‌పల్లి నల్ల చెరువు పరిసరాలకు రావాలంటే వెనుకడుగు వేసేవారని.. ఇప్పుడు చెరువు చుట్టూ చక్కర్లు కొడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ అన్నారు. ఆక్రమణలు తొలగించి 16 ఎకరాలుగా మిగిలిపోతుందనుకున్న చెరువును 30 ఎకరాలకు విస్తరించి సుందరంగా తీర్చిదిద్దడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను శాలువతో సన్మానించారు. నల్లచెరువు ప్రారంభోత్సవంలో పెద్దయెత్తున స్థానికులు పాల్గొననున్నారని తెలిపారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, హైడ్రా డీసీపీ శ్రీకాంత్, ఏడీసీపీ సుదర్శన్తో పాటు.. పలువురు అధికారులు కూకట్‌పల్లి నల్లచెరువును సందర్శించిన వారిలో ఉన్నారు.

## లైకుల కోసం లైఫ్ రిస్కు చేయొద్దు.. వీడియో పోస్టు చేసిన సీపీ సజ్జనార్



**హైదరాబాద్ పెన్ పవర్:** లైకుల కోసం లైఫ్ రిస్క్ చేయొద్దని యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హితవు పలికారు. కదులుతున్న రైలు నుంచి వేలాడుతూ రీల్ చేస్తుండగా స్తంభం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఆ వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసి సజ్జనార్ హెచ్చరించారు."సోషల్ మీడియాలో వైరల్ కావాలని యువత స్టంట్లు చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. నడుస్తున్న రైలుకు వేలాడుతూ వీడియోలు తీయడం ప్రమాదకరం. లైకులు, వ్యూస్ కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దు. ప్రమాదకరమైన స్టంట్లు చేస్తే ప్రాణాలు కోల్పోక తప్పదు. ఇంట్లో ఎదురుచూస్తున్న కుటుంబం గురించి ఒక్కసారి ఆలోచించాలి" అని సజ్జనార్ హితవు పలికారు.

## రోజుకో గంట వెచ్చిస్తే.. ఆరోగ్యం మీ వెంటే



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్ కలెక్టరేట్: ఎంత బిజీగా ఉన్నా రోజుకో గంట వెచ్చిస్తూ నడక, వ్యాయామం చేయగలిగితే ఆరోగ్యంగా ఉండొచ్చని రోగాలు దరిచేరే అవకాశం తక్కువని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలకు సూచించారు. మంత్రి జూపల్లి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. తొలుత నెరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభించారు. ఆ తర్వాత కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లకు 99 రోజుల పాటు కొనసాగే 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమ అమలుపై దిశానిర్దేశం చేశారు. సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వారం రోజుల్లో ఆయా సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి అందజేయాలని ఆదేశించారు. సమీక్షలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌తో పాటు ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆ పథకాలతో మహిళల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలోని మహిళలకు అపార గౌరవం, అవకాశాలు లభిస్తున్నాయని, నారీ శక్తి అనేది బీజేపీ నినాదం మాత్రమే కాదని, దేశ నిర్మాణానికి సంబంధించిన ఒక జాతీయ మిషన్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్?రావు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర మహిళ మోర్చా విభాగం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా హాజై ప్రసంగించారు.

-4లో


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# ఆ పథకాలతో మహిళల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు

-3 పేజి తరువాయి

మోడీ ప్రారంభించిన భేటీ బచావో, భేటీ పడావో పథకం సమాజంలో పెద్ద మార్పు వచ్చిందన్నారు. నేడు ఆడబిడ్డలను కాపాడడమే కాకుండా వారికి విద్య, సాధికారత కల్పించే దిశగా దేశం ముందుకు సాగుతోంది.కేంద్ర ప్రభుత్వం మహిళల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పీఎం ఉజ్వల యోజనతో కోట్లాది కుటుంబాలు ఎల్‌పీజీ సౌకర్యం పొందాయని, గ్యాస్ వాడకంతో గృహ వాయు కాలుష్యం తగ్గి, మహిళల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. ఆవాస్ యోజనతో కోట్లాది మంది పేద కుటుంబాలకు పక్కా ఇల్లు కల్పిస్తూ, మహిళల పేరుతో ఇంటి హక్కు, తక్కువ వడ్డీతో రుణాలు, అధిక సబ్సిడీ కల్పిస్తూ సొంతింట కలను సాకారం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్మును భారత రాష్ట్రపతిగా బీజేపీ మద్దతుతో ఎన్నుకోవడం జరిగింది. సమాజంలోని ప్రతి వర్గానికి చెందిన మహిళలను సాధికారత కల్పించాలనే బీజేపీ సంకల్పానికి నిదర్శనమన్నారు. పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండగా, కొత్త పార్లమెంట్ భవనంలో తొలి రోజే దీనిని ఆమోదింపజేసి మోడీ ప్రభుత్వం మహిళా సాధికారతపై తన నిబద్ధతను చాటిచెప్పిందన్నారు. తెలంగాణలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని గృహ హింసతో పాటు ఇతర నేరాల కేసులు వేలల్లో నమోదవుతున్నాయి. భద్రత కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. చదువుకున్న మహిళలు, యువ మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన సమయం వచ్చిందన్నారు.

## సంక్షేమ పథకాల్లో పారదర్శకత- సాంకేతికతతో అక్రమాలకు చెక్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పాలనా యంత్రాంగాన్ని మరింత చైతన్యవంతం చేస్తూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఒక సమగ్రమైన రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచుల నుంచి మేయర్ల వరకు ప్రతి ప్రజాప్రతినిధిని భాగస్వాములను చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేవలం అధికార యంత్రాంగమే కాకుండా, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం జిల్లా కేంద్రాల్లో ప్రజాప్రతినిధులకు వారి విధులు, బాధ్యతలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, అవసరమైన సమాచారాన్ని ప్రింటెడ్ మెటీరియల్ రూపంలో అందజేయనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకే అందాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత ప్రతి పథకంలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసరా పింఛన్లలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసరా పింఛన్లలో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా సుమారు 3 లక్షల మంది అనర్హులను తొలగించింది ప్రభుత్వం. సాంకేతికతను సక్రమంగా వినియోగించుకపోవడం వల్ల గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణ మాఫీ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా వెల్లడించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కలుగుతున్న లబ్ధిని లెక్కలతో సహా వివరించడం ద్వారా పాలనలో జవాబుదారితనం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంప్రదాయం నుంచి ఆధునికతవైపు తెలంగాణ అన్నదాతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. వ్యవసాయ పంప్‌సెట్‌ల స్థానంలో సోలార్ పంప్ సెటు వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని, ఇళ్లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఆదాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖకు సూచించారు. వ్యవసాయం శాఖ కేవలం విత్తనాలు,ఎరువులు పంపిణీకే పరిమితం కాకుండా శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని సకాలంలో రైతులకు అందించే, ఏ నేలలో ఏ పంట వేస్తే లాభదాయకమో సూచించాలని ఆదేశించారు. యూరియా యాప్‌లో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి, నానో యూరియా వినియోగాన్ని క్షేత్రస్థాయి ప్రదర్శనల ద్వారా రైతులకు చేరువ చేయాలని నిర్ణయించారు. నాణ్యమైన సేవల దిశగా రాష్ట్రంలోని ప్రభుత్వం వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకుప్రభుత్వం ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్థానిక పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో అనుసంధానం చేయనున్నారు. మెడికల్ కాలేజీల్లో అందుబాటులో ఉన్నఅత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన వైద్యులు, ప్రొఫెసర్ల సేవలు సామాన్య ప్రజలకు కూడా అందేలా రిఫరల్ విధానాన్ని బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. విద్యా రంగంలో సంస్కరణలకు ప్రాధాన్యతఇస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగాన్ని అరికట్టే బాధ్యతను విద్యాసంస్థల యాజమాన్యాలకే అప్పగించారు. విద్యార్థుల మానసిక స్థితిని గమనిస్తూ వారికి సరైన మార్గదర్శనంచేసేందుకు ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలో సైకాలజిస్ట్‌లను నియమించడం తప్పనిసరి చేయనున్నారు. మరోవైపు మధ్యాహ్నం భోజన పథంలో ఎక్కడా అంతరాయం కలగకుండా ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులుచెల్లించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ప్రజాభద్రత, మౌలిక సదుపాయాలు రహదారి భద్రతకు పెద్దపీట వేస్తూ, రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారులపైగుంతలు, ప్రమాదకర ప్రాంతాల సమాచారం పంపేందుకు ఒక ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రజలు పంపేసమాచారం ఆధారంగా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు.ఆర్టీసీ, సరకు రవాణా వాహనాల డ్రైవర్ల కోసం వారు నిరంతరం కలుసుకునే చోట్లే ఉచిత కంటి పరీక్షల శిబిరాలను నిర్వహించాలని రవాణా శాఖకు ఆదేశించారు. నగరాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, విద్యార్థి హాస్టళ్లు భద్రత, అనుమతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వాటి యాజమాన్యాలను జవాబుదారీ చేయాలని సూచించారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఓఆర్ఆర్ పరిసరాల్లో నిర్మాణ వ్యర్థాలను పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలను బాధ్యులను చేస్తూ జరిమానాలు విధించాలని ఆదేశించారు

# మహిళా సంఘాలతో ముఖాముఖి పాల్గొన్న మంత్రి పొన్నం

హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ - వ్యర్థాల సేకరణ సెంటర్ ను ప్రారంభించారు. హైదరాబాద్ లో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన అద్దాల లైబ్రరీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. మహిళా సంఘాలకు 35 కోట్ల రూపాయలు సున్నా వడ్డీ రుణాలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలతో ముఖాముఖి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం 99 రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాలు వార్డుల నుండి రాజధాని వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు.

చాచా నెహ్రూ పార్క్ లో ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రారంభించుకున్నాం. 12 వేల గ్రామాల్లో,వార్డుల్లో ,మున్సిపాలిటీ లలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇక్కడ ఈరోజు ఈ వ్యర్థాల సేకరణ సెంటర్ ప్రారంభించాం. మన ఇళ్లలో ఉండే పాత టీవీ లు ,పాత ఫ్రిడ్జిలు , కంప్యూటర్ ,ల్యాప్ టాప్ లు పాడైపోయిన వాటిని అక్కడే ఉంచడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు.. దానిని ఈ వ్యర్థాల సేకరణ సెంటర్ కి తెచ్చి రీసైక్లింగ్ చేయాలని అన్నారు.



ఇక్కడ 1500 చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించుకున్నాం.. ఇది స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.. పుస్తకాలు డొనేట్ చేయడానికి ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశాం. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించుకున్నాం. పట్టణంలో మహిళా సంఘాల సభ్యుల సంఖ్య తక్కువ ఉంది.. ప్రతి మహిళా మహిళా సంఘంలో చేరాలి. మహిళలకు ఉచిత బస్సుతో పాటు అనేక కార్యక్రమాలు చేపట్టింది.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం,రేషన్ కార్డులు మహిళల పేరు మీద ఇస్తున్నాం. ఐకేపీ,మహిళా సంఘాల తరుపున బస్సులు ఆర్టీసీ లో నడుస్తున్నాయి.. బస్సులకు మహిళలను యజమానులను చేయడం జరిగింది. మహిళా సంఘాల్లో మహిళలు చేరాలి.. ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రుణాలు పొంది ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి. సెట్విన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం..కుట్టు మిషన్లు అందిస్తున్నాం. మీ కాళ్ళ మీద మీరు నిలబడాలి. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో మహిళలు చురుకుగా ఉండాలి. విద్యా ,వైద్యం ,పర్యావరణం , భద్రత ఇలా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలి. మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం లో పాల్గొని.పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశాలలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహం.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మహబూబ్నగర్ శాసనసభ్యులు ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి .వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ .మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్ల కోత్వాల్ .రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి.ఐదు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.అటవీ శాఖకు సంబంధించిన చిన్న సమస్యల పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అవి ఏళ్ల తరబడిగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆయన మంత్రిగారు దృష్టికి తీసుకువచ్చారు.జిల్లా హాస్పిటల్స్ లో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే వారిని హైదరాబాద్ సిఫారసు చేస్తున్నారని ఆస్పత్రులలో కావలసిన అన్ని సదుపాయాల ఏర్పాటు కోసం మంత్రిగారి దృష్టి సారించారని ఆయన కోరారు.సమృద్ధిగా యూరియా ఉన్న చిన్న చిన్న సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆన్లైన్ బుకింగ్ లాంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బేస్మెట్ లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో పూర్తిస్థాయి అవగాహన లేదని లబ్ధిదారులకు అందుకు సంబంధించిన అవగాహన కల్పించేలా చూడాలని ఆయన సూచించారు .వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో ఒకలాగా మరికొన్ని ప్రాంతాల్లో ఇంకోలా ఉందని అలాంటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు.

### ఆర్మూర్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఆర్మూర్, మార్చి 6 పెన్ పవర్:** ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ఉమ మహేశ్వర రావు ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ పాలకవర్గంతో 99 రోజుల ప్రణాళికపై తీర్మానం చేయించారు. ఈ ప్రణాళిక ద్వారా ఆర్మూర్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కమిషనర్ తెలిపారు. అనంతరం పలు వార్డులలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

### ధర్పల్లిలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**నిజామాబాద్ అర్బన్, మార్చి 6 పెన్ పవర్:** ధర్పల్లి మండలంలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు శుక్రవారం 209 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 207 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, ఎండలను దృష్టిలో ఉంచుకొని మినరల్ వాటర్ సదుపాయం కల్పించామని ఆయన పేర్కొన్నారు.

### దుబ్బాక రేకులపల్లి డైవర్షన్ రోడ్డు పనుల ప్రారంభం



**బోధన్, మార్చి 6 పెన్ పవర్:** ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామం నుండి రేకులపల్లి వెళ్లే రోడ్డు డైవర్షన్ రోడ్డు కింద రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఏడు లక్షల రూపాయలు మంజూరు చేశారు. శుక్రవారం డైవర్షన్ రోడ్డు పనులను ధర్పల్లి మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్రాజ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సర్పంచ్ సరోజినీ దేవి, రేకులపల్లి సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గాలు తదితరులు పాల్గొన్నారు.

### ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**బాల్కొండ, మార్చి 6 పెన్ పవర్:** నిజామాబాద్ నగర శివారులో ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇటుక బట్టీ యజమాని శ్రీనివాస్ తన కారులో ఎనిమిది మంది కూలీలతో కలిసి మహారాష్ట్రలోని నాందేడ్ నుండి తిరిగి వస్తుండగా, కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ దుర్ఘటనలో సత్వా తుకారాం వాగ్మారే (44), అతని భార్య శోభ (42) అక్కడికక్కడే మృతి చెందారు. చింతల శ్రీనివాస్, బాలాజీ, శాత్వ, వాగ్మారే తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని జీజీహెచ్‌కు తరలించారు. సీపీ సాయిచైతన్య ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### ఎమ్మెల్యేకు భాజపా నేత ప్రత్యేక అభినందనలు

**షాద్‌నగర్, మార్చి 6 పెన్ పవర్:** విద్యార్థుల భవితవ్యం, సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిరంతరం ఆకాంక్షిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. జూనియర్ కళాశాల నూతన భవనం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేకతను చాటుకుంటున్నారని మహేందర్ రెడ్డి కొనియాడారు.

### వైద్య అరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమాలు

**రాజేంద్రనగర్, మార్చి 6 పెన్ పవర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా, వైద్య ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి (మార్చి 6, 2026) జిల్లా వ్యాప్తంగా స్పెషలిస్ట్ వైద్యులచే ఆరోగ్య సేవలు ప్రారంభించబడతాయి. ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12, 2026 వరకు కొనసాగుతుంది. మొదటి దశలో, మార్చి 6 నుండి మార్చి 31 వరకు, మాతృ ఆరోగ్యం, మహిళా ఆరోగ్యం, శిశు ఆరోగ్యం మరియు వృద్ధుల కోసం ప్రత్యేక పరీక్షలు మరియు చికిత్సలు అందించబడతాయి.

### ఆదేవాలయంలో ఘనంగా కుంకుమార్చన పూజ

**పరిగి, మార్చి 6 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం మొగిలిగిద్ద గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వేద పండితులు, ఎన్ శేషాద్రి చార్యులు ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఈ పూజ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

### షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక

**కొడంగల్, మార్చి 6 పెన్ పవర్:** పట్టణ అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం షాద్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సీ.డి.ఎం.ఏ డైరెక్టర్ మమత పాల్గొన్నారు. ఈ ప్రణాళిక పట్టణ అభివృద్ధి మరియు ప్రజా సేవల మెరుగుదలను లక్ష్యంగా పెట్టుకుంది.

### అల్లు శిరీష్ వివాహానికి హాజరైన సీఎం రేవంత్

-3 పేజి తరువాయి

ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అల్లు కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొన్నారు.గత నాలుగైదుళ్లుగా అల్లు శిరీష్, నయనిక ప్రేమించుకుంటున్నారు. ఫ్యామిలీ ఫంక్షన్లలో ఏర్పడిన వీరి పరిచయం ప్రేమగా మారి, నేడు పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలెక్కింది. కాగా, మూడు రోజుల క్రితమే వీరి ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన అనేకమంది ప్రముఖులు హాజరుకాగా.. నేడు జరిగిన పెళ్లిని మాత్రం అత్యంత ప్రైవేట్‌గా, సన్నిహితుల సమక్షంలో జరిపించడం విశేషం. ప్రస్తుతం అల్లు వారింట జరిగిన ఈ పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విధేయతకు పెద్ద పీట

**మహబూబ్ నగర్, మార్చి 6, పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీలో 'హైకమాండ్' అంటే ఒకప్పుడు అది ఒక భయం, ఒక భక్తి. కానీ తెలంగాణలో మాత్రం ఇప్పుడు సీన్ మారింది. అప్పట్లో వైఎస్సార్ తన ఆత్మబంధువు కేవీపీ కోసం అధిష్ఠానాన్ని ఎలా ఒప్పించేవారో.. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే రూట్ మ్యాప్ ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది.పాపం ప్రియాంక గాంధీ గారు ఎంతో ఆశగా వంశీచంద్ రెడ్డి పేరును సిఫార్సు చేశారట. "మా వంశీకి ఒక అవకాశం ఇవ్వండి" అని ఆమె కోరితే.. "లేదు మేడమ్, మా 'వేం' ఉంటేనే మాకు క్షేమం" అని రేవంత్ రెడ్డి మొండికేసినట్లు సమాచారం. మొత్తానికి అధిష్ఠానం పట్టును రేవంత్ తన 'పట్టు'దలతో సడలించారు. ఢిల్లీ పెద్దల మాట నెగ్గకపోయినా, రేవంత్ మాట నెగ్గడంతో గాంధీ భవన్‌లో ఇప్పుడు కొత్త నినాదం వినిపిస్తోంది: "హైకమాండ్ ఇచ్చేది బి-ఫామ్ మాత్రమే.. అభ్యర్థిని తేల్చేది మాత్రం రేవంత్ అన్నే!"ఇక అభ్యర్థుల ఎంపిక చూస్తే.. కాంగ్రెస్ పార్టీకి కోర్టుల్లో కష్టమొచ్చినా, పొలిటికల్ కోర్టులో తలనెప్పి వచ్చినా గుర్తొచ్చే ఏకైక పేరు అభిషేక్ మను సింఘ్వీ. ఆయనకు సీటు ఇవ్వకపోతే కాంగ్రెస్ ఫైళ్లు కదిలేలా లేవు, అందుకే ఆయనకు మళ్ళీ 'పెద్దల సభ' టికెట్ ఖరారైంది. కానీ అసలు కిక్కు ఇచ్చింది మాత్రం వేం నరేందర్ రెడ్డి ఎంపికే!రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నా, కారాగారంలో ఉన్నా వెన్నంటి ఉన్నందుకు నరేందర్ రెడ్డికి 'రాజ్య'యోగం పట్టింది. రెడ్డి కోటాకే పట్టం కట్టింది. "అన్నీ వేరే వాళ్ళకే ఇస్తున్నారు.. మా వాళ్ళ సంగతేంటి?" అని రేవంత్ వేసిన రెడ్డి కార్డు ముందు ప్రియాంక గాంధీ మార్కు పాలిటిక్స్ కూడా పని చేయలేదు.అసెంబ్లీలో ప్రతిపక్షం బిఆర్ఎస్ పరిస్థితి 'సైలెంట్ మోడ్'లో ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థులకు పోలింగ్ అవసరం లేకుండానే గెలుపు ఖాయమైపోయింది. నామినేషన్ వేయడమే ఆలస్యం.. గెలుపు గుర్రాలు రెడీ!ఢిల్లీలో చక్రం తిప్పే పెద్దల ముందు, తెలంగాణ 'రీజనల్' చక్రం గట్టిగా తిరిగింది. వంశీచంద్ రెడ్డికి ప్రియాంక హస్తం ఉన్నా.. వేం నరేందర్ రెడ్డికి మాత్రం రేవంత్ 'మస్తీ' తోడైంది!

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మహిళా హాకీ పోరు.. ఏర్పాట్లు పూర్తి



**మక్తల్, మార్చి 6 పెన్ పవర్:** అంతర్జాతీయ మహిళా హాకీ సమరానికి భాగ్యనగరం సిద్ధమైంది. ఎఫ్ఐహెచ్ ఆధ్వర్యంలో మార్చి 8 నుంచి 14 వరకు గచ్చిబౌలి స్టేడియంలో ప్రపంచ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్లు జరగనున్నాయి. ఈ టోర్నీ ఆహ్వాన పత్రికను సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డికి ముక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేన రెడ్డి అందజేశారు. ఇంగ్లాండ్, కొరియా, ఇటలీ వంటి జట్లు ఇప్పటికే నగరానికి చేరుకుని ప్రాక్టీస్ మొదలుపెట్టాయని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషం.

## గంగమ్మ తల్లికి ఘనంగా బోనాలు

**కొల్లాపూర్, మార్చి 6 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో సాయంత్రం గంగమ్మ తల్లి ఆలయంలో బోనాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు తలపై బోనాలు ఎత్తుకొని డప్పుల మేళం, భక్తి నాదాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు:

**వనపర్తి, మార్చి 6 పెన్ పవర్:** వనపర్తి జిల్లా ఎస్పీ సునీత అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. , తూముకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాలతో వనపర్తి సీఐ రత్నం వీపనగండ్ల పోలీసులతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

# క్యూర్- ప్యూర్ రీజియన్ల అడుగులు

**హైదరాబాద్ మార్చి 6, పెన్ పవర్:** హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్- ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు.ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# మినీ మాల్దీవులుగా ..కృష్ణా నది బ్యాక్ వాటర్స్

**మహబూబ్ నగర్ మార్చి 6, పెన్ పవర్:** వీకెండ్‌లో ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా.. వరుస సెలవుల్లో మాల్దీవులు లాంటి ప్రదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నారు.. తెలుగు రాష్ట్రాలు దాటి ఎక్కడికి వెళ్లినా ఖర్చుతో కూడుకున్న యాత్రే అవుతుంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉండే వారు తక్కువ బడ్జెట్‌లో మాల్దీవులను చూసి ఫీలింగ్ పొందడానికి ఓ ఆహ్లాదకరమైన ప్రదేశం ఉంది. అదే తెలంగాణ మినీ మాల్దీవులు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సోమశిలను తెలంగాణ మినీ మాల్దీవులుగా పిలుస్తారు. జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా సోమశిలకు అవార్డు కూడా దక్కింది.కృష్ణా నది బ్యాక్ వాటర్స్ అందాలతో ముస్తాబైన ఈ ప్రాంతం, ఇప్పుడు పర్యాటకులకు మినీ మాల్దీవులుగా మారిపోయింది. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ సమీపంలో ఉన్న సోమశిల గ్రామం వద్ద కృష్ణా నది ఒక సముద్రాన్ని తలపిస్తుంది. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్స్ ఇక్కడ భారీ జలాశయంగా కనిపిస్తాయి. నల్లమల అటవీ శ్రేణుల మధ్యలో ఈ నీటి ప్రవాహం పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తోంది. నగర జీవన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలనుకునే వారికి సోమశిల ఒక ఫర్ఫెక్ట్ డెస్టినేషన్ అని చెప్పొచ్చు.సోమశిల ప్రాంతాన్ని పర్యాటకులను మంత్రముగ్దులను చేసేలా తీర్చిదిద్దారు. ఒక్కసారి ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే.. మళ్లీమళ్లీ రావాలనిపించేలా ఈ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులు కల్పించారు. నది తీరాన నిర్మించిన హరిత రిసార్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నదికి ఎదురుగా ఉండే కాటేజీల కిటికీల నుంచి చూస్తే నీటి అలలు పాదాలను తాకుతున్నాయా..? అన్నంత దగ్గరగా ప్రకృతి కనిపిస్తుంది. ఇక్కడ బోటింగ్ ప్రయాణం అత్యంత సాహసోపేతంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. కొండల మధ్య నీటిలో పడవలో ప్రయాణిస్తుంటే తియ్యని అనుభూతి కలుగుతుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రూయిజ్ బోట్లు పర్యాటకులను అద్దాల మఠ్రి వంటి సమీప ప్రాంతాలకు తీసుకెళ్తాయి.సోమశిల కేవలం విహారయాత్రకే పరిమితం కాదు.. ఆధ్యాత్మిక ప్రాంతం కూడా. ఇక్కడ వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ శ్రీ లలిత సోమేశ్వర స్వామి దేవాలయం కూడా ఉంది. 12 జ్యోతిర్లింగాలకు ప్రతీకగా ఇక్కడ 12 శివలింగాలు కొలువై ఉండటం విశేషం. ప్రతీ సంవత్సరం పుష్య బహుళ అమావాస్య రోజున ఇక్కడ జరిగే జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. కృష్ణా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు.సోమశిల ప్రాంతం హైదరాబాద్ నుంచి సుమారు 170 నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సొంత వాహనాల్లో వచ్చేవారు కొల్లాపూర్ మీదుగా ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో విదేశీ పర్యాటక అనుభూతిని పొందవచ్చునని ఇక్కడికి వచ్చే పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీకెండ్స్‌లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండడంతో హరిత రిసార్ట్స్‌లో బస చేయాలనుకునేవారు ముందుగానే ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**నల్లగొండ, మార్చి 6 పెన్ పవర్:** నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం గుండెపోటుతో అనంత (45) మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చిట్యాల సునీత దానియేలు, మృతుడి కుటుంబానికి ?5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, చిట్యాల యల్లయ్య, సతీష్, సోమయ్య మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ రిప్రజెంటేటివ్ సూసైడ్

**మిర్యాలగూడ, మార్చి 6 పెన్ పవర్:** హైదరాబాద్ ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడలో , ఓ ఫార్మా కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న నల్గొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన జూలూరు అఖిలేశ్ టార్గెట్ల పేరుతో కంపెనీ వేధింపుల కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అఖిలేశ్ మామ అతడి గది వద్దకు వచ్చి చూడగా, కిటికీ గ్రిల్స్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. తోటి ఉద్యోగులు సేల్స్ మేనేజర్స్, ఉన్నతాధికారుల ఒత్తిడి వల్లే అఖిలేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అఖిలేశ్ ఇతర కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్లిన విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు అతడిని బెదిరించారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

# ఈటెల దారెటు

**హైదరాబాద్, కరీంనగర్, మార్చి 6, పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి.. గులాబీ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగిన ఈటెల రాజేందర్ అనివార్య పరిస్థితుల్లో అత్యంత అవమానకరంగా కారు పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఆ తర్వాత కమలం పార్టీలో చేరారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలలో పోటీ చేసి ఓడిపోయారు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి స్థానం నుంచి ఎంపీగా గెలిచారు.కమలం పార్టీలో ఉంటున్నప్పటికీ ఈటల రాజేందర్ కు సముచితమైన స్థానం లభించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజేందర్ గులాబీ గూటికి వెళ్తారని సోషల్ మీడియాలో ప్రచారం కూడా జరుగుతుంది. అయితే ఆయన కాంగ్రెస్ లోకి వెళ్లే ఛాన్స్ ఉందని మొన్నటిదాకా ప్రచార జరిగినప్పటికీ.. అలాంటి అవకాశం లేదని ఆయన మద్దతుదారులు అంటున్నారు. పురపాలక ఎన్నికల్లో ఆయన కేవలం మల్కాజి గిరి స్థానానికి మాత్రమేపరిమితం అయ్యారు. కరీంనగర్ లో జోక్యం చేసుకోకూడదని ఇప్పటికే ఆయనకు అధిష్టానం చెప్పినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా ఆయనకు అవకాశం కల్పించినప్పటికీ.. ఎక్కడికక్కడ బంధనాలు విధించినట్టుప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గాన్ని కాపాడుకోలేదనే భావన రాజేందర్ లో ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో హుజురాబాద్లో పట్టు కోసంరాజేందర్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో ఈటల రాజేందర్ కు మధ్య ఉప్పు నిప్పు లాగా వ్యవహారం సాగుతోందని రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య బండి సంజయ్.. ఈటల రాజేందర్ పరోక్షంగా విమర్శలు కూడా చేసుకున్నారు. రాజేందర్ అయితే తన స్వరాన్ని పెంచి పేరు చెప్పకుండా బండి సంజయ్ వర్గం మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.ఈ పరిణామాలు మొత్తం ఈటెల రాజేందర్ వర్గీయులలో అంతర్మథనానికి కారణమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీలో ప్రాధాన్యం లేనప్పుడు.. గుర్తింపు ఇచ్చే పార్టీలోకి వెళ్లాలని ఈటెల రాజేందర్ మీద ఆయన అనుచరులు తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలో అయితే ఈటెల రాజేందర్ కు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానాలు అందుతున్నట్టు తెలుస్తోంది. అందువల్లే ఈటల రాజేందర్ మౌనంగా ఉంటున్నట్టు తెలుస్తోంది.గతంలో బిజెపిలో చేరికల కమిటీ చైర్మన్ గా రాజేందర్ పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎంపిగా కూడా గెలిచారు. కానీ ఆయనకు కేంద్ర కేబినెట్లో చోటు లభించలేదు. దీనికి తోడు రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఆశించారు. అది కూడా ఆయనకు దక్కలేదు. రామచంద్రరావుకు బిజెపి స్టేట్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడం రాజేందర్ లో అసహనాన్ని కలిగించిందని ఆయన వర్గీయులు చెబుతుంటారు. తన ఆవేదనను అమిత్ షా వంటి నేతలతో చెప్పుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రాజేందర్ అనేక సందర్భాలలో తన అనుచరుల వద్ద వాపోయినట్టు తెలుస్తోంది.ఇటీవల స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకత్వం వ్యవహరించిన

తీరు కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు సమాచారం. స్థానిక ఎన్నికల తర్వాత పార్టీలో రాజేందర్ అంత వ్యూహాత్మకంగా కనిపించడం లేదు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కీలకమైన నాయకుడిగా ఎదిగిన రాజేందర్.. ఇప్పుడు కేవలం మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానానికి పరిమితం కావడానికి ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ అధిష్టానం కావాలని ఇలా చేసిందా? వేరే వ్యక్తుల ఒత్తిడి వల్ల ఇలా చేస్తోందా? అనే ప్రశ్నలు కార్యకర్తల్లో వ్యక్తం అవుతున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న మున్సిపల్ ఎన్నికలకు దూరంగా ఉండాలని రాజేందర్ ను పార్టీ అధిష్టానం ఆదేశించడం మింగుడు పడని విధంగా ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గీయులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా రాజేందర్ ను పేర్కొన్నప్పటికీ.. కరీంనగర్ జిల్లాలో వేలు పెట్టకూడదని చెప్పడం ఒకరకంగా ఆయన వేగానికి స్పీడ్ బ్రేకర్ వేయడం లాంటిదేనని కార్యకర్తలు అంటున్నారు. అధిష్టానం వైఖరితో రాజేందర్ సీరియస్ గా ఉన్నారని.. త్వరలోనే ఆయన వేరే నిర్ణయం తీసుకోబోతున్నారని తెలుస్తోంది.ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గీయులకు ప్రాధాన్యం దక్కకపోవడంతో వారంతా కూడా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున బరిలోకి దిగారు. దీనికి తోడు ఆ మధ్య సోషల్ మీడియాలో రాజేందర్ కు వ్యతిరేకంగా ప్రచారం జరిగింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే హుజరాబాద్ అసెంబ్లీ స్థానం ఉంటుంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజేందర్ అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ప్రత్యేకమైన వర్గం కూడా ఉంది. బిజెపిలో రాజేందర్ చేరినప్పుడు వారు కూడా కాషాయం కండువా కప్పుకున్నారు. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి గెలిచిన బండి సంజయ్ ప్రస్తుతం ఇక్కడ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ ఉండేది. ఇప్పుడు ఆ గ్యాప్ మరింత పెరిగింది. వీరిద్దరి మధ్య సయోధ్య కుదరచడానికి అనేకమంది నేతలు ప్రయత్నించినప్పటికీ అంతగా సక్సెస్ కాలేదు.ఆమధ్య ఈటెల రాజేందర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది నేతలు హైదరాబాదులోని షామీర్పేట ప్రాంతంలో భేటీ అయినట్టు వార్తలు వస్తున్నాయి. వారందరికీ అండగా ఉంటానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే కొద్ది రోజులకే గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో తన వర్గీయులను రాజేందర్ రంగంలోకి దింపారు. కొన్ని పంచాయతీలలో రెబల్ అభ్యర్థులుగా కూడా పోటీలో ఉంచారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఈటల రాజేందర్ ను హుజరాబాద్ నియోజకవర్గం లోకి ప్రవేశించకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గం అడ్డుకున్నట్టు ప్రచారంలో ఉంది. ఈ పరిణామం రాజేందర్ ను ఇబ్బందికి గురి చేసిందని.. పార్టీ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఆయన నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో మల్కాజి గిరి పార్లమెంటు స్థానానికే రాజేందర్ పరిమితమయ్యారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజేందర్ మీద తీవ్రస్థాయిలో పోస్టులు కనిపిస్తున్నాయి. వాటిపై ఆయన స్పందించారు. అవన్నీ కూడా పిచ్చోళ్ళు పెట్టే పోస్టులని ఆయన వ్యాఖ్యానించారు.ఇక అప్పట్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పీ ఆర్ ఓ ను ఉద్దేశించి రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆ రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అంతేకాదు తాను ఏ పార్టీలో ఉన్నాననే విషయం ప్రజలు తేల్చుకుంటారని రాజేందర్ అన్నారు. సోషల్ మీడియా పోస్టులు ఆధారంగా రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని రాజేందర్ పేర్కొన్నారు. అయితే ఆయనకు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానం లభించిందని.. త్వరలోనే ఆయన ఆ పార్టీలో చేరబోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# దేశం గర్వించదగిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో ఆధునిక ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనకు పునాది వేసిన ప్రముఖ శాస్త్రవేత్తలలో అప్పడవేదుల లక్ష్మీనారాయణ పేరు గౌరవప్రదంగా నిలుస్తుంది. శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ప్రతిభ, అంకితభావం కలిసిన అరుదైన వ్యక్తిత్వంగా ఆయన భారతీయ విజ్ఞాన చరిత్రలో చిరస్మరణీయుడయ్యారు. ముఖ్యంగా సౌర భౌతిక శాస్త్రం, నక్షత్రాల వర్ణపట విశ్లేషణ, ఖగోళ పరిశీలనా పరికరాల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చేసిన కృషి భారత ఖగోళ శాస్త్రానికి కొత్త దిశను నిర్దేశించింది. కొడైకెనాల్ సౌర పరిశోధనా కేంద్ర అభివృద్ధిలో ఆయన పోషించిన పాత్ర భారత ఖగోళ విజ్ఞాన చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలిచింది.అప్పడవేదుల లక్ష్మీనారాయణ 1887లో తూర్పుగోదావరి జిల్లాలోని అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు అప్పడవేదుల వ్యాసులు, మహాలక్ష్మి దంపతులు. చిన్ననాటి నుంచే విజ్ఞాన శాస్త్రాలపై అతీతమైన ఆసక్తి చూపిన లక్ష్మీనారాయణ, చదువులోనే కాకుండా పరిశోధనాత్మక ఆలోచనలో కూడా ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినా, ప్రపంచ విజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలనే తపన ఆయనలో చిన్నప్పటినుంచే స్పష్టంగా కనిపించింది.ప్రాథమిక విద్యను కొత్తపేట ఉన్నత పాఠశాలలో పూర్తి చేసిన ఆయన, అనంతరం రాజమండ్రిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బి.ఎ. చదివారు. 1910లో ఆ విద్యను విజయవంతంగా పూర్తిచేసి, తరువాత భౌతిక శాస్త్రంపై మరింత లోతైన అధ్యయనం చేయాలనే సంకల్పంతో మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు. 1914లో భౌతిక శాస్త్రంలో ఎం.ఎ. పట్టా పొందారు. ఆ కాలంలో భారత దేశంలో శాస్త్ర పరిశోధనలకు తగిన వసతులు పరిమితంగా ఉన్నప్పటికీ, ఆయనలోని పరిశోధనాసక్తి తగ్గలేదు.తరువాత విజయనగరం మహారాజా కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించారు. అదే సమయంలో ఆయనకు ఉన్నత శాస్త్రీయ పరిశోధన చేయాలనే సంకల్పం మరింత బలపడింది. ఈ సంకల్పమే ఆయనను ఇంగ్లండ్‌కు తీసుకెళ్లింది. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో డాక్టరేట్ పూర్తి చేసి ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలో మరింత లోతుగా ప్రవేశించారు.ఆ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఖగోళ పరిశోధన వేగంగా అభివృద్ధి చెందుతోంది. నక్షత్రాల నిర్మాణం, సూర్యుని స్వభావం, అంతరిక్షంలోని మూలకాల స్వరూపం వంటి అంశాలు శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లక్ష్మీనారాయణ చేసిన పరిశోధనలు భారతదేశాన్ని అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర రంగంలో నిలబెట్టాయి. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఆయన కొడైకెనాల్‌లోని సౌర పరిశోధనా కేంద్రంలో సేవలు ప్రారంభించారు. తమిళనాడులోని కొడైకెనాల్ పర్వత ప్రాంతంలో ఉన్న ఈ పరిశోధనా కేంద్రం భారత ఖగోళ పరిశోధనలో ప్రముఖ స్థానం కలిగినది. ఇక్కడ పనిచేస్తూ ఆయన సూర్యుని నిర్మాణం, వాతావరణం, శక్తి ఉద్గారాలు, సౌర మచ్చలు వంటి అంశాలపై లోతైన పరిశోధనలు చేశారు.సూర్యుని వర్ణపట విశ్లేషణ ఆయన పరిశోధనల్లో అత్యంత ప్రాధాన్యం పొందిన అంశం. సూర్యుని నుండి వచ్చే కాంతిని ప్రత్యేక పరికరాల సహాయంతో విభజించి పరిశీలించడం ద్వారా సూర్యుని వాతావరణంలో ఉన్న మూలకాలను గుర్తించే విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ రంగంలో లక్ష్మీనారాయణ చేసిన పరిశోధనలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి. ఆయన సౌర వర్ణపటంలోని వివిధ స్పెక్ట్రల్ లైన్లను విశ్లేషించి సూర్యుని వాయుమండల నిర్మాణం గురించి విలువైన వివరాలను వెలికితీశారు.సూర్యుని ఉపరితలంపై కనిపించే సౌర మచ్చలు, సౌర జ్వాలలు, సౌర మబ్బులు వంటి పరిణామాలపై ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ శాస్త్రవేత్తల ప్రశంసలను అందుకున్నాయి. సూర్యుని ఉపరితల ఉష్ణోగ్రత మార్పులు, వాతావరణ స్థితిగతులు, కాంతి ఉద్గారాల స్వభావం వంటి అంశాలను ఆయన సూక్ష్మంగా పరిశీలించారు. ఈ పరిశోధనలు తరువాతి తరం ఖగోళ శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలిచాయి. సూర్యుని వర్ణపట విశ్లేషణ ద్వారా హైడ్రోజన్, హీలియం వంటి మూలకాల ఉనికి గురించి శాస్త్రీయ ఆధారాలను సమర్థంగా వివరించడంలో ఆయన పాత్ర విశేషమైనది. అంతేకాకుండా నక్షత్రాల వర్ణపటాలపై చేసిన పరిశోధనలు కూడా ఖగోళ భౌతిక శాస్త్ర అభివృద్ధికి మేలుచేశాయి. నక్షత్రాల ఉష్ణోగ్రత, రసాయనిక నిర్మాణం, పరిణామ ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో ఆయన చేసిన పరిశోధనలు విశేషంగా ఉపయోగ పడ్డాయి.నక్షత్రాల వర్ణపటాలలో కనిపించే ప్రత్యేక రేఖలను విశ్లేషించి అవి ఏ మూలకాల ఉనికిని సూచిస్తాయో ఆయన అధ్యయనం చేశారు. ఈ పరిశోధనలు నక్షత్రాల నిర్మాణాన్ని అర్థం చేసుకోవడంలో శాస్త్రవేత్తలకు సహాయపడ్డాయి. అంతరిక్షంలోని నక్షత్ర సమూహాల పరిణామం గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో కూడా ఆయన కృషి ప్రముఖమైనది.ఖగోళ పరిశోధనకు అవసరమైన పరికరాల అభివృద్ధి విషయంలో కూడా లక్ష్మీనారాయణ విశేష కృషి చేశారు. పరిశీలనా పరికరాల నాణ్యత మెరుగు పడితేనే ఖచ్చితమైన పరిశోధనలు సాధ్యమవుతాయని ఆయన నమ్మకం. అందువల్ల కొడైకెనాల్ పరిశోధనా కేంద్రంలో ఉన్న సౌర స్పెక్ట్రోగ్రాఫ్ పరికరాలను ఆధునీకరించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ ఆధునీకరణ వల్ల సూర్యుని వర్ణపట పరిశోధనలు మరింత ఖచ్చితంగా నిర్వహించే అవకాశం లభించింది.భారత దేశంలో ఖగోళ పరిశోధనను సంస్థాగతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం కృషి చేశారు. భారత ఖగోళ పరిశోధన అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన కలగన్నారు. ఈ దిశగా శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం, పరిశోధన వాతావరణాన్ని మెరుగుపరచడం వంటి పనుల్లో కూడా ఆయన ముఖ్య పాత్ర పోషించారు.ఆయన చేసిన విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం 1957లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఇది భారతదేశంలో శాస్త్రవేత్తలకు లభించే అత్యున్నత గౌరవాలలో ఒకటి. ఆయన ప్రతిభకు గుర్తింపుగా భారత జాతీయ సైన్స్ అకాడమీ ఫెలోగా ఎంపికయ్యారు. అలాగే లండన్‌లోని భౌతికశాస్త్ర సంస్థ ఫెలోగా కూడా ఎన్నికయ్యారు. తిరువాన్కూరు మహారాజా వారు ప్రదానం చేసిన "కర్జన్ స్మారక బహుమతి" ఆయన శాస్త్రీయ ప్రతిభకు మరో గుర్తింపుగా నిలిచింది. భారత సైన్స్ కాంగ్రెసులో భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షుడిగా ఆయన సేవలందించారు. శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా విజ్ఞాన పరిపాలనలో కూడా ఆయన సమర్థత చూపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ సభ్యునిగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా తన ఆలోచనలను పంచుకున్నారు.అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర సమాజం కూడా ఆయన కృషిని గౌరవించింది. చంద్రుని ఉపరితలంపై ఉన్న ఒక బిలానికి "లక్ష్మీనారాయణ" అనే పేరు పెట్టడం ఆయనకు లభించిన అరుదైన గౌరవం. ఇది ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిలో ఎంత ప్రాధాన్యం పొందాయో తెలియజేస్తుంది.1973 మార్చి 7న అప్పడవేదుల లక్ష్మీనారాయణ పరమపదించారు. అయితే ఆయన చేసిన పరిశోధనలు కాలాన్ని దాటి నేటికీ శాస్త్ర ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. భారతదేశంలో ఖగోళ భౌతిక శాస్త్ర అభివృద్ధికి ఆయన వేసిన పునాది తరువాతి తరాల శాస్త్రవేత్తలకు బలమైన ప్రేరణగా నిలిచింది.కొడైకెనాల్

ఖ సౌర పరిశోధనా కేంద్రం అభివృద్ధి చెందడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తించదగినది. ఆయన కాలంలో ప్రారంభమైన పరిశోధనా సంప్రదాయం తరువాతి దశల్లో మరింత విస్తరించి భారతదేశాన్ని అంతర్జాతీయ ఖగోళ పరిశోధనలో ఒక ప్రముఖ కేంద్రంగా నిలబెట్టింది.భారతదేశంలో శాస్త్ర పరిశోధనకు స్వదేశీ ప్రతిభ ఎంత గొప్పదో అప్పడవేదుల లక్ష్మీనారాయణ జీవితం మనకు స్పష్టంగా తెలియజేస్తుంది. సాధారణ గ్రామంలో జన్మించి ప్రపంచ ఖగోళ శాస్త్ర వేదికపై భారతదేశాన్ని నిలబెట్టిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకం. విజ్ఞానంపై ఆసక్తి, పరిశోధనపై నిబద్ధత, దేశాభివృద్ధి పట్ల అంకితభావం కలిసినప్పుడు సాధారణ మనిషి కూడా అసాధారణ శిఖరాలను అధిరోహించగలడని ఆయన జీవిత గాథ చాటి చెబుతుంది. భారత ఖగోళ భౌతిక శాస్త్ర చరిత్రలో అప్పడవేదుల లక్ష్మీనారాయణ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. సూర్యుని రహస్యాలను అన్వేషించిన ఆ మహానుభావుడు భారత విజ్ఞాన సంపదకు అందించిన సేవలు శాశ్వతంగా నిలిచే ఆభరణాలు. శాస్త్రానికి ఆయన అంకితమైన జీవితం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తూ దేశం గర్వించదగిన వారసత్వంగా నిలిచిపోతుంది.

# దటీజ్ రేవంత్



**హైదరాబాద్, మార్చి 6, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తన రాజకీయ చాణక్యాన్ని, అధిష్టానం వద్ద తనకున్న తిరుగులేని పట్టును నిరూపించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వంటి మహా సముద్రంలో ఎందరో సీనియర్ తిమింగలాల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, తన అత్యంత సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ బెర్త్ ఖరారు చేయించుకోవడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఇది కేవలం ఒక సీటు కేటాయింపు మాత్రమే కాదు, ఢిల్లీ పీఠంపై రేవంత్ ముద్ర ఏ స్థాయిలో ఉందో చాటిచెప్పే పరిణామం.కాంగ్రెస్ పార్టీలో ఒక సామెత ఉంది "ఢిల్లీలో చక్రం తిప్పడం అందరికీ సాధ్యం కాదు" అని. కానీ రేవంత్ రెడ్డి ఆ సామెతను తిరగరాస్తున్నారు. తాజాగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో రేవంత్ రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకోవడం ద్వారా పార్టీలో తనదే 'పైచేయి' అని స్పష్టం చేశారు. దాదాపు 16 మంది సీనియర్ నేతలు రాజ్యసభ రేసులో పోటీ పడినా, అంతిమంగా ముఖ్యమంత్రి తన మిత్రుడు వేం నరేందర్ రెడ్డి వైపే అధిష్టానాన్ని మొగ్గు చూపేలా చేయగలిగారు.వి. హనుమంతరావు, జీవన్ రెడ్డి, కుసుమ కుమార్ వంటి హేమాహేమీలు ఈ సీటు కోసం తీవ్రంగా శ్రమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి కుసుమ కుమార్ లేదా వీహెచ్ పేర్లను ప్రతిపాదించి చక్రం తిప్పాలని చూశారు. మరోవైపు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దరఖాస్తుల కట్టలతో అధిష్టానం చుట్టూ తిరిగారు. కానీ, రేవంత్ రెడ్డి వ్యూహం ముందు ఇవేవీ పారలేదు. ఇటీవల రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చినప్పుడు ఈ విషయంపై దాటవేత ధోరణి ప్రదర్శించడం వెనుక ఉన్న మర్మం.. రేవంత్ రెడ్డితో చర్చించాకే తుది నిర్ణయం

తీసుకోవాలనే సంకేతమే అని ఇప్పుడు స్పష్టమవుతోంది.వేం నరేందర్ రెడ్డి, రేవంత్ రెడ్డిల స్నేహం దశాబ్దాల నాటిది. జడ్పీటీసీ స్థాయి నుంచి మొదలైన వీరి ప్రస్థానం టీడీపీ, బీఆర్ఎస్ మీదుగా కాంగ్రెస్ వరకుకొనసాగింది. రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నప్పుడు, రాజకీయ సంక్షోభాల్లో ఉన్నప్పుడు నరేందర్ రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారు. ప్రస్తుతం సీఎం పేషీలో కీలక వ్యక్తిగా, ప్రభుత్వ సలహా దారుగా ఉన్న నరేందర్ రెడ్డిని ఢిల్లీకిపంపడం ద్వారా, అక్కడ తనకంటూ ఒక నమ్మకస్తుడైన ప్రతినిధి ఉండాలని రేవంత్ భావించారు. ప్రభుత్వానికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయించుకోవడానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుంది.ఈపరిణామాన్ని దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంతో పోలిస్తే రేవంత్ వేగం ఆశ్చర్యపరుస్తుంది. వైఎస్సార్ తన ఆత్మబంధువు కేవీపీ రామచంద్రరావుకు రాజ్యసభ సీటు ఇప్పించుకోవడానికి ఐదేళ్లు వేచి చూడాల్సివచ్చింది. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల లోపే తన మిత్రుడిని రాజ్యసభకు పంపగలిగారు. నాడు కేంద్రంలో కాంగ్రెస్ బలంగా ఉండటం వల్ల వైఎస్సార్‌కు కొంత పరిమితులు ఉండేవి, కానీ నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో.. తెలంగాణ లాంటి రాష్ట్రం నుంచి పార్టీని బలోపేతం చేస్తున్న రేవంత్ మాటకు అధిష్టానం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.ఇటీవల ఏఐ డీప్ ఫేక్ వీడియోల ద్వారారేవంత్ రెడ్డిని అధిష్టానం దూరం పెడుతోందని, ఖర్గే ఆయన్ని దగ్గరకు రానివ్వడం లేదని జరిగిన దుష్ప్రచారానికి ఈ నిర్ణయం ఒక గట్టి సమాధానం. ఢిల్లీలో ఒక సీటునుఅభిషేక్ మను సింఘ్వి వంటి మేధావికి కేటాయించి,మరో సీటును తన మిత్రుడికి దక్కించుకోవడం ద్వారా రేవంత్ తన బలాన్ని నిరూపించుకున్నారు.వరుసగా వచ్చే రాష్ట్రాల ఎన్నికలు, ముఖ్యంగా కేరళ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి అందుతున్న సహకారం,రేవంత్ పనితీరు పట్ల రాహుల్ గాంధీకి ఉన్న నమ్మకం వెరసి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ కింగ్ గా మార్చాయి. ఎన్ని ఫిర్యాదులు, ఎంతమంది సీనియర్ల అసంతృప్తులు ఉన్నా.. విజేతగా నిలవడం రేవంత్ స్టైల్ అని మరోసారి రుజువైంది.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ ఎం పాత సర్పంచ్

**వరంగల్, మార్చి 6, పెన్ పవర్:**
తెలంగాణ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చిడబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు.తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం

నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైందిపలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురించే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతోతీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాపు రూ. 1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని

డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారుతాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడం వల్ల.. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త

సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను

కూడా త్వరగా విడుదలయ్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

## ఎంచగూడెంలో కొమ్మాలమ్మ తల్లిని దర్శించుకున్న లక్ష్మణ్ రావు



**వరంగల్ ఈస్ట్, మార్చి 6 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో కొమ్మాలమ్మ తల్లి జాతర వైభవంగా జరుగుతోంది. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివస్తున్నారు. ఈ సందర్భంగా, ఆదివాసీ తెలంగాణ రాష్ట్ర తలపతుల సంఘం అధ్యక్షుడు యాప లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు భూమయ్య శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర పూజారులు వారికి ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు

## డంపింగ్ యార్డ్ లో దట్టమైన పొగ రోడ్డుపై నిరసన చేసిన ప్రజలు

**వరంగల్ వెస్ట్, మార్చి 6 పెన్ పవర్:**హన్మకొండ జిల్లా డంపింగ్ యార్డ్ నుండి వెలువడిన దట్టమైన పొగతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి నిరసనగా నాయకులు, ప్రజలు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పోలీసుల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని పొగను అదుపు చేయడానికి తాత్కాలిక చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం!

**వర్ధన్నపేట, మార్చి 6 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బొత్తవాని గూడెంకు చెందిన సురేందర్, కుటుంబ కలహాల కారణంగా రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని కుటుంబ సభ్యులు 108 ద్వారా నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

## ఎక్సైజ్ కాలనీలో చైన్ స్నాచింగ్

**పరకాల, మార్చి 6 పెన్ పవర్:** హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో మామిండ్ల నవ్య అనే మహిళ ఇంట్లో ముగ్గు వేస్తుండగా, మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో సుబేదారి సీఐ రంజిత్ కుమార్ దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాయి.

## ఇంట్లో వెలువడే చెత్తను తప్పనిసరిగా వేరు చేయాలి..

**నర్సంపేట, మార్చి 6 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ర్యాలీ ద్వారా ప్రారంభించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, మలవిసర్జన చేయకూడదని, పబ్లిక్ టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని, ఇంట్లో చెత్తను వేరు చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రజలకు సందేశాలు ఇచ్చారు. ఈ ర్యాలీ పురపాలక సంఘ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు జరిగింది.

## సిద్దిపేటలో రంజాన్ కిట్ల పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



**మెదక్, మార్చి 6 పెన్ పవర్:**మాజీ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు, శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని 13వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ విఠోబ, నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, బషీర్ అన్వర్ షకీల్ సాహెబ్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఐదుగురికి రూ. 50వేల జరిమానా

**గజ్వేల్, మార్చి 6 పెన్ పవర్:** గజ్వేల్ పట్టణంలో వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి రూ. 50వేల చొప్పున, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో ఐదుగురికి రూ. 25వేల చొప్పున జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ తీర్పు వెలువరించారు. ఈ తీర్పు వెలువడినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. పట్టణంలోని పలు చౌరస్తాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ పది మంది పట్టుబడ్డారు.

## జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**దుబ్బాక, మార్చి 6 పెన్ పవర్:** జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డిస్టిక్ లెవెల్ విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, అంగన్వాడీల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని, అంగన్వాడి టీచర్, ఆయా పోస్టుల ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అన్ని సంక్షేమ హాస్టళ్లలో పౌష్టికాహారం అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థలలో ఆహారం, అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

# ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం



**ఆదిలాబాద్, మార్చి 6 పెన్ పవర్:** ఆదిలాబాద్‌లోని కొలం ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం 'ఇగ్నైట్ యువర్ డ్రీమ్స్' కార్యక్రమం జరిగింది. గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి హాజరై పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం వద్దని, ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతరం కృషి చేయాలని, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**బోథ్, మార్చి 6 పెన్ పవర్:** ఈనెల 10న ఆదిలాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరగనుంది. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ముఖ్యంగా ఆదివాసి నిరుద్యోగులు ఉద్యోగాలు సంపాదించేలా ఆదివాసి పెద్దలు కృషి చేయాలని ఆయన కోరారు.

# చెత్త డంప్ పొగతో ఊపిరి తీసుకోలేకపోతున్నాం

**నిర్మల్, మార్చి 6 పెన్ పవర్:** నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నిర్మల్ మున్సిపల్ డంపింగ్ యార్డ్ నుండి వెలువడుతున్న చెత్త, పొగతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం సర్పంచ్ మాదాస్తు సునీత ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాత్రిపూట గ్రామంలో ఉండలేకపోతున్నామని, కిటికీలు మూసుకొని నిద్రపోవాల్సి వస్తుందని, కలుషితమైన పొగతో శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. మున్సిపల్ అధికారులు తీరు మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, చెత్తకు నిప్పు పెట్టడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

**ఖానాపూర్, మార్చి 6 పెన్ పవర్:** శుక్రవారం సోన్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. కూలీల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి, హాజరు తీసుకున్నారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఫీల్డ్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనిచేయాలని, దాని ప్రకారమే వేతనాలు చెల్లింపులు జరుగుతాయని ఆయన తెలిపారు. కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్

**ముథోల్, మార్చి 6 పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక 30, 40 వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజలు, వ్యాపారస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అడ్డు విజయలక్ష్మి, సముందర్ పల్లి రాజు, మాజీ కౌన్సిలర్ అడ్డు పోశెట్టి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా డా. కొర్ర లక్ష్మి

**మానకొండూరు, మార్చి 6 పెన్ పవర్:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా డా. కొర్ర లక్ష్మిను నియమించింది. రేపటి నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నారు. ఈ సమయంలో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడం, ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టడం, సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## సర్పంచ్ కారుకి అడ్డు వచ్చాడని వ్యక్తిపై దాడి

**చొప్పదండి, మార్చి 6 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సర్పంచ్ భర్త గట్టు గంగారం, ఆయన కుటుంబీకులు కలిసి దమ్మ తిరుపతి అనే వ్యక్తిపై కారుకు అడ్డు వచ్చాడనే కారణంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

## వేములవాడ రాజన్న గుడిలో ధ్వజ కళ్యాణం

**వేములవాడ, మార్చి 6 పెన్ పవర్:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శివ కళ్యాణ మహోత్సవాలు అంతరంగికంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం ధ్వజ కళ్యాణం అనంతరం, ఆలయ పార్కింగ్ స్థలంలోని శివార్చన స్టేజిపై ఉదయం 10 గంటలకు శివ కళ్యాణం ప్రారంభమవుతుందని అర్చకులు తెలిపారు. ఇప్పటికే కల్యాణ మండపం ప్రత్యేక పుష్పాలతో అలంకరించబడింది. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకను తిలకించడానికి తరలివస్తున్నారు.

## ఇందిరమ్మ పెండింగ్ బిల్లులపై మంత్రి కీలక ప్రకటన

**ఖమ్మం, మార్చి 6 పెన్ పవర్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే లక్ష రూపాయల బిల్లు పొంది, తదుపరి బిల్లులు పెండింగ్ లో ఉన్న వాటిని వెంటనే విడుదల చేయాలని సూచించారు. కొన్ని కారణాల వల్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే, ఇందిరమ్మ కమిటీల ద్వారా ఆ ఇళ్లను అర్హులైన మరొకరికి కేటాయించాలని కూడా మంత్రి సూచించారు.

## స్తంభాన్ని ఢీకొన్న బైక్.. వ్యక్తికి గాయాలు

**మధిర, మార్చి 6 పెన్ పవర్:** ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండకు చెందిన జాకీర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. జాకీర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అతివేగం కారణంగా బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జాకీర్ను వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ స్థాయి సెమినార్ కు కరపత్రం ఆవిష్కరణ



**కరీంనగర్, మార్చి6 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 30, 31 తేదీలలో "మల్టీ డిసిప్లినరీ సెమినార్ ఆన్ ఎకలాజికల్ రెస్టోరేషన్ అసెసింగ్ ది ఇంపాక్ట్ అఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్" అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనుంది. ఈ సెమినార్ కు సంబంధించిన కరపత్రాన్ని ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ, ౹ఉఅఉం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారు సురేందర్ రెడ్డి, సెమినార్ సమన్వయకర్త కిరణ్మయి శుక్రవారం ఆవిష్కరించారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# గులాబీ వ్యూహం... ఇంతేనా



**హైదరాబాద్, మార్చి 6, పెన్ పవర్:**

రాజకీయం అంటేనే వ్యూహం.. ఆ వ్యూహంలో ప్రతివ్యూహం ఉండాలి. కానీ బీఆర్ఎస్ పార్టీ వ్యూహం మాత్రం ప్రస్తుతం "పులి వేషం వేసి పిల్లిలా పలకరించినట్టు" తయారైంది. ఏ ఎన్నిక వచ్చినా "ఢీ అంటే ఢీ" అని తొడకొట్టడం.. తీరా సమయం వచ్చేసరికి "అబ్బే.. మాకు ఆసక్తి లేదు" అని చేతులెత్తేయడం గులాబీ బాసులకు అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో తగిలిన దెబ్బ మర్చిపోకముందే తాజాగా రాజ్యసభ ఎన్నికల రూపంలో మరో 'షాక్' తగిలింది. అసెంబ్లీలో సంఖ్యాబలం లేకపోయినా, బయట మాత్రం "అభిషేక్ సింఘ్వీని అడ్డుకుంటాం.. ఫిరాయింపుదారులకు విప్ జారీ చేస్తాం.. రాజకీయం అంటే చూపిస్తాం" అంటూ కేటీఆర్, హరీష్ రావు ఊదరగొట్టారు. తీరా చూస్తే కాంగ్రెస్ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజసం ఉట్టిపడేలా నామినేషన్లు వేశారు. మరి మన బీఆర్ఎస్ అభ్యర్థి ఎక్కడయ్యా అంటే.. "వెతుకులాటలో ఉన్నాం" అని సమాధానం వస్తోందిగులాబీ బాస్ కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉండి అప్పుడప్పుడు ఇచ్చే స్టేట్‌మెంట్లు కార్యకర్తల్లో జోష్ నింపుతాయని అనుకుంటే అవి కాస్తా "గాలి తీసిన బెలూన్"లా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో కేటీఆర్, హరీష్ రావులు ఎంతగా కష్టపడుతున్నా, ప్రజలు మాత్రం "అధికారం ఉన్నప్పుడేమో బయటకి రాలేదు.. ఇప్పుడు మాత్రం ఫాంహౌస్ దాటి వస్తున్నారా?" అని సెటైర్లు వేస్తున్నారు."మేము పోటీ చేస్తాం.. గెలుస్తాం" అని ఆశావహులకు ఆశలు చూపించడం.. వాళ్లు కోట్లు ఖర్చు పెట్టుకోవడానికి రెడీ అయ్యాక, "వ్యూహాత్మకంగా తప్పుకుంటున్నాం" అని ప్లేటు తిప్పేయడం బీఆర్ఎస్ మార్క్ అయిపోయింది.ప్రస్తుతం బీఆర్ఎస్ కేడర్ పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా మారింది. అధిష్టానం చెప్పే మాటలు వింటేనేమో అతివిశ్వాసం కనిపిస్తోంది.. రిజల్ట్స్ చూస్తేనేమో అట్టడుగున ఉంటున్నారు. "కాంగ్రెస్ పరువు తీస్తాం" అని వెళ్తే చివరకు సొంత పార్టీ పరువు కాపాడుకోవడమే గగనమైపోతోంది.రాజ్యసభ ఎన్నికల నుంచి తప్పుకోవడం ద్వారా "మా దగ్గర బలం లేదు" అని బీఆర్ఎస్ అఫీషియల్‌గా ఒప్పేసుకున్నట్లయింది. మరి ఈ 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తూ వచ్చే ఎన్నికల నాటికి బీజేపీకి బీ-టీమ్ అవుతారో లేక నిజంగానే మళ్లీ పుంజుకుంటారో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం తెలంగాణ పాలిటిక్స్‌లో కాంగ్రెస్ 'హస్తం' పైచేయి సాధిస్తుంటే కారు మాత్రం రివర్స్ గేర్‌లో వెళ్తోంది!

# వైద్యరంగానికి బసవపట్నం కృషి

భారతదేశంలో ఆధునిక వైద్య విజ్ఞానం అభివృద్ధి చెందడంలో అనేక మంది వైద్యులు, పరిశోధకులు, విద్యావేత్తలు తమ జీవితాలను అంకితం చేశారు. ఆ మహనీయుల సరసన గౌరవంగా నిలిచే పేరు డాక్టర్ బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు. శస్త్రచికిత్స రంగంలో ఆయన చేసిన సేవలు భారత వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వైద్యుడిగా, ఉపాధ్యాయుడిగా, పరిశోధకుడిగా, రచయితగా ఆయన చూపిన ప్రతిభ, సమర్పణ, దూరదృష్టి భారత వైద్యరంగ అభివృద్ధికి కీలకంగా మారాయి. తన సుదీర్ఘ వైద్య జీవితంలో ఆయన శస్త్రచికిత్సలో అనేక కొత్త పద్ధతులను ప్రవేశపెట్టి, వైద్య విద్యకు కొత్త దిశానిర్దేశం చేశారు. వైద్య సేవలు సమాజానికి సేవ అనే భావనను ఆచరణలో చూపించిన మహనీయుల్లో బాలకృష్ణారావు ప్రముఖులు. బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు 1910 జనవరి 21న కర్ణాటక రాష్ట్రంలోని రామనగర జిల్లాలోని చన్నపట్న పట్టణంలో జన్మించారు. ఆయన కుటుంబంలో వైద్య సంప్రదాయం ఉండటం ఆయన జీవితాన్ని వైద్య రంగం వైపు మళ్లించింది. ఆయన తండ్రి డాక్టర్ బి.కె.నారాయణరావు ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు. బెంగళూరులోని మింటో కంటి ఆసుపత్రి స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారు. వైద్య సేవల పట్ల తండ్రికి ఉన్న నిబద్ధత చిన్ననాటి నుంచే బాలకృష్ణారావుపై ప్రభావం చూపింది. చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన ఆయనలో వైద్య విద్య పట్ల ఆసక్తి పెరిగింది. ప్రాథమిక మరియు మధ్య విద్యను మైసూరులో పూర్తి చేసిన బాలకృష్ణారావు తరువాత ముంబై విశ్వవిద్యాలయంలో వైద్య విద్యను అభ్యసించారు. అక్కడ వైద్యశాస్త్రంలో పట్టభద్రుడైన ఆయన మరింత ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లారు.ఆ కాలంలో విదేశీ విద్య ఎంతో కఠినమైనదిగా, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది. అయినప్పటికీ తన కృషి, పట్టుదలతో ఆయన ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధి గాంచిన శస్త్రచికిత్సా విద్యను అభ్యసించారు. 1936లో ఓఖీఅూ పట్టా, 1937లో ఈఖీఅూ పట్టాలను సంపాదించి శస్త్రచికిత్సలో నైపుణ్యం సాధించారు. ఈ విద్యాభ్యాసం ఆయనకు అంతర్జాతీయ స్థాయి వైద్య పరిజ్ఞానాన్ని అందించింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత ఆయన వైద్య సేవలను ప్రారంభించారు. 1940లో మైసూర్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన వైద్య బోధనా జీవితాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు శస్త్రచికిత్సను బోధించే విషయంలో ఆయన ప్రత్యేకమైన పద్ధతులను అవలంబించారు. శస్త్రచికిత్స అనేది కేవలం సిద్ధాంత జ్ఞానం కాదు, అనుభవంతో కూడిన కళ అని ఆయన నమ్మకం. అందుకే వైద్య విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన బోధనా విధానం వల్ల అనేక మంది విద్యార్థులు నిపుణులైన శస్త్రవైద్యులుగా ఎదిగారు. 1945లో మైసూర్ మెడికల్ కాలేజీలోనే శస్త్రచికిత్స విభాగానికి ప్రొఫెసర్‌గా మరియు విభాగాధిపతిగా నియమితులయ్యారు. అక్కడ ఆయన వైద్య విద్యను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేశారు. శస్త్రచికిత్సా విభాగంలో ఆధునిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించారు. రోగుల చికిత్సలో నూతన విధానాలను ప్రవేశపెట్టారు. ఈ కాలంలో ఆయన వైద్య సేవలు మాత్రమే కాకుండా విద్యా రంగంలోనూ విశేష గుర్తింపు పొందారు. 1947లో గ్వాలియర్‌లోని గజర రాజా మెడికల్ కాలేజీలో చేరిన బాలకృష్ణారావు అక్కడ దాదాపు రెండు దశాబ్దాలపాటు సేవలందించారు. ప్రొఫెసర్‌గా, తరువాత డీన్‌గా పనిచేస్తూ వైద్య విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆ కాలంలో భారతదేశంలో వైద్య విద్య అభివృద్ధి దశలో ఉండేది. శిక్షణా సదుపాయాలు పరిమితంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో బాలకృష్ణారావు తన దూరదృష్టితో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించే విధంగా పాఠ్యపద్ధతులను రూపొందించారు. ఆసుపత్రి సేవలు, వైద్య విద్య, పరిశోధనల మధ్య సమన్వయం సాధించడానికి ఆయన కృషి చేశారు. 1964లో ఆయన ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో శస్త్రచికిత్స విభాగానికి ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా నియమితులయ్యారు. దేశంలో అత్యున్నత వైద్య సంస్థగా గుర్తింపు పొందిన ఈ సంస్థలో ఆయన చేసిన సేవలు ఎంతో కీలకమైనవి. అక్కడ ఆయన శస్త్రచికిత్స విభాగాన్ని మరింత అభివృద్ధి చేశారు. శస్త్రచికిత్సలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చారు. వైద్య విద్యార్థులు, యువ వైద్యులు పరిశోధనలకు ఆసక్తి చూపేలా ప్రోత్సహించారు. ఆయన నాయకత్వంలో అనేక పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. శస్త్రచికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు విశేష ప్రాధాన్యం పొందాయి. ముఖ్యంగా న్యూరోసైన్సెస్, మూత్రపిండ సంబంధిత వ్యాధులు, కాలేయ వ్యాధులపై ఆయన పరిశోధనలు చేశారు. శిశువుల్లో కనిపించే ప్రాథమిక కాలేయ క్యాన్సర్‌పై ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ వైద్య వర్గాలలో చర్చనీయాంశమయ్యాయి. "ప్రైమరీ కార్సినోమా ఆఫ్ లివర్ ఇన్ ఇన్ఫెన్సీ" అనే అంశంపై ఆయన చేసిన అధ్యయనం వైద్య ప్రపంచంలో గుర్తింపు పొందింది. వైద్య రంగంలో కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి ఆయన పరిశోధనలు తోడ్పడ్డాయి. డాక్టర్ బాలకృష్ణారావు ఒక గొప్ప రచయిత కూడా. శస్త్రచికిత్స, వైద్య విద్య, వైద్య విధానాలపై ఆయన అనేక శాస్త్రీయ వ్యాసాలు రాశారు. దేశ విదేశాల్లో వెలువడే వైద్య పత్రికల్లో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. శస్త్రచికిత్సలోని క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించడం ఆయన ప్రత్యేకత. వైద్య విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచే పాఠ్యగ్రంథాలను కూడా రచించారు. ఆయన రచనలు ఇప్పటికీ వైద్య రంగంలో ఉపయోగపడుతున్నాయి. వైద్య విద్యలో శిక్షణకు ఆయన అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. వైద్య విద్యార్థులు ప్రారంభ దశ నుంచే శస్త్రచికిత్సా పద్ధతులను నేర్చుకోవాలని ఆయన భావించేవారు. అందుకే యువ వైద్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రత్యక్షంగా శస్త్రచికిత్సలను చూపిస్తూ విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం అందించారు. ఈ విధానం వల్ల ఆయన శిష్యుల్లో అనేక మంది తరువాత ప్రముఖ శస్త్రవైద్యులుగా ఎదిగారు. వైద్య రంగంలో సంస్థాగత అభివృద్ధికి కూడా బాలకృష్ణారావు కృషి చేశారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా అనే ప్రముఖ వైద్య సంఘానికి ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంఘం ద్వారా దేశవ్యాప్తంగా శస్త్రచికిత్స వైద్యులకు శిక్షణా కార్యక్రమాలు, శాస్త్రీయ సమావేశాలు నిర్వహించబడ్డాయి. వైద్య పరిశోధనలను ప్రోత్సహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అనేక గౌరవాలు లభించాయి. 1945లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించింది. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు ఇది గొప్ప గుర్తింపుగా నిలిచింది. తరువాత కాలంలో అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆయనకు గౌరవాలు లభించాయి. ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సభ్యత్వం పొందడం ఆయన ప్రతిభకు నిదర్శనం. 1972లో ంఎఐఓూ నుండి పదవీ విరమణ చేసిన తరువాత కూడా ఆయన వైద్య సేవలను ఆపలేదు. 1975లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో సైంటిస్ట్ ఎమెరిటస్‌గా పనిచేశారు. తరువాత ఇండోర్‌లోని చోయిత్‌రామ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్

సెంటర్‌లో సేవలందించారు. వృద్ధాప్యంలో కూడా ఆయన పరిశోధన, వైద్య సేవలను కొనసాగించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. తన జీవితాంతం వైద్య రంగ అభివృద్ధి కోసం కృషి చేసిన బాలకృష్ణారావు 1995 మార్చి 7న 85 సంవత్సరాల వయసులో పరమపదించారు. ఆయన మరణం భారత వైద్య రంగానికి తీరని లోటుగా భావించబడింది. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సంస్థ 2000 సంవత్సరంలో "డాక్టర్ బాలకృష్ణారావు ఒరేషన్" అనే వార్షిక ఉపన్యాసాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరం ప్రముఖ వైద్యులను సత్కరించడం జరుగుతోంది. డాక్టర్ బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు జీవితం భారత వైద్యరంగానికి ఆదర్శంగా నిలిచింది. శస్త్రచికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు, వైద్య విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి, వైద్య సేవల పట్ల ఆయన చూపిన నిబద్ధత సమాజానికి స్ఫూర్తిదాయకం. వైద్యుడు కేవలం రోగాలను నయం చేసే వ్యక్తి మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకుడిగా ఉండాలని ఆయన జీవితం చెబుతోంది. ఆయన వారసత్వం నేటి వైద్య ప్రపంచంలో కూడా ప్రేరణగా నిలుస్తోంది. భారతదేశంలో శస్త్రచికిత్స రంగ అభివృద్ధిలో ఆయన పాత్ర అమూల్యమైనది. వైద్య విద్యార్థులకు, యువ వైద్యులకు ఆయన జీవితం ఒక మార్గదర్శక దీపంలా నిలిచింది. సేవాభావం, పరిశోధనా దృక్పథం, విద్యా పరమైన కృషి ? ఈ మూడు లక్షణాల సమన్వయం డాక్టర్ బాలకృష్ణారావు వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. భారత వైద్య రంగ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. శాస్త్రసాధనకు అంకితమైన ఆయన జీవితం భవిష్యత్ తరాల వైద్యులకు స్ఫూర్తి ప్రసాదిస్తూ చిరస్మరణీయంగా నిలిచిపోతుంది.

# బీపీ కమిటీ నివేదిక తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరు ఊరిస్తోంది. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్ పెడతారని ఊహాగానాలు వినిపించినప్పటికీ..ఇప్పటికీ ఓ క్లారిటీ లేదు. జనగణన అడ్డంకిగా మారిందన్న ప్రచారం ఓవైపు..స్టేట్ ఈసీ రివ్యూస్..లోకల్ బాడీ పోల్స్‌పై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక వరుసపెట్టి జూన్ లోపు స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలనుకుంది ఏపీ సర్కార్. కానీ ఇంతలోనే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ అమలు దిశగా అడుగులు వేసింది. ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక బీసీ కోటా పెంపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాకే..లోకల్ ఫైట్‌పై ముందడుగు వేస్తారన్న టాక్ బయలుదేరింది.మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్..ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి..ఓటర్ల జాబితాను ఫైనల్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీని ప్రకారం..ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్న పంచాయతీలకు గడువు ప్రకారం..ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీగా ఉన్నట్లే. కానీ పల్లె పోరుపై సర్కారు ఆలోచన మాత్రం వేరేగా ఉందట. ఏప్రిల్ 2నే గ్రామాల స్థాయిలో పంచాయతీలకు గడువు ముగిసిపోనున్నా..ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీ రిజర్వేషన్లపై మిశ్రా కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత..ప్రభుత్వం అధ్యయనం చేసి..ఎన్నికలకు వెళ్లనుందని అంటున్నారు. ఈ ప్రాసెస్‌కు కొంత టైమ్ పట్టే అవకాశం ఉంటుంది. ఇక రిజర్వేషన్లపై ఎలాగూ న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటిన్నింటిని సాల్వ్ చేసుకుని..బీసీ కోటాను పెంచే లోకల్ బాడీ ఎన్నికలపై ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తోందట.ఇలా స్థానిక పోరుపై ఎప్పటికప్పుడు అప్ డేట్స్ కమింగ్ సూన్ అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసినా..కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించే యోచనలోనే ఉందంటున్నారు. ఏప్రిల్‌లోపు ఎన్నికలకు వెళ్తారని ప్రచారం జరుగుతున్న టైమ్‌లోనే ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీస్‌లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో సెన్సేషనల్ డెసిషన్ తీసుకుంది కూటమి ప్రభుత్వం.బీసీ కోటా పెంపు సాధ్యాసాధ్యాలు, న్యాయ సమస్యల అధ్యయనానికి కమిషన్ వేసింది సర్కార్. బీసీలకు రాజకీయంగా మేలు చేసే ఉద్దేశంతో ఏకంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు స్టార్ట్ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది సర్కార్. ఈ కమిషన్ పూర్తిగా అధ్యయనం చేసి తన నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. 45 రోజుల్లో నివేదికను ఇవ్వాలని కూడా ఏకసభ్య కమిషన్‌కు కాల పరిమితిని విధించింది సర్కార్. కమిషన్ ఇచ్చే రిపోర్ట్‌ను బేస్ చేసుకుని బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెసిషన్ తీసుకోనుంది.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమకు ఇంకా అడ్వాంటేజ్ మారుతుందని..బెటర్ రిజల్ట్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ట్రంప్ కార్డుగా వాడుకునేందుకు ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. అయితే రిజర్వేషన్లు పెంపు హామీకి కూటమి సర్కార్ కట్టుబడి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డుగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పే..బీసీ రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ఏపీలో ఇప్పటికే బీసీలకు 24 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దీనిని 34 శాతానికి పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరి సుప్రీంకోర్టు పెట్టిన కోటా దాటిపోనుంది.ఇటీవల తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు పెట్టిన
పరిమితిని దాటాలని ప్రయత్నించినా, లీగల్ సమస్యలు వచ్చి కోర్టుల్లోనే ఆగిపోయిన పరిస్థితి. అయితే ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకునే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను ఫాలో అయ్యే ఆలోచనలో ఉందట కూటమి సర్కార్. అందుకే ముందుగా బీసీల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని అంటున్నారు.ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా సూచనలు ఇవ్వాలని ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌కు సూచించింది ప్రభుత్వం. ఒకవేళ కమిషన్ రిపోర్ట్ బేస్ చేసుకుని జీవోనో ఆర్డినెన్సో జారీ చేస్తే..లీగల్ సమస్యలు వచ్చినా కేంద్రంతో చర్చించి బీసీ కోటా పెంపునకు లైన్ క్లియర్ చేసుకోవాలని భావిస్తున్నారట కూటమి పెద్దలు. ఒకవేళ చట్టపరంగా రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు వస్తే..పార్టీపరంగా బీసీలకు అధిక సీట్లు కేటాయించే యోచనలో కూడా ఉన్నారట. ఈ నేపథ్యంలో ఏపీలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# కలకలం రేపుతున్న విజయసాయి కామెంట్స్



**నెల్లూరు, మార్చి 6, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణంలో "కూటమి ఉన్నంత వరకు వైసీపీకి అవకాశం లేదు" అనే వ్యాఖ్యలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు పార్టీ మాజీ నాయకుడు, మాజీ ఎంపీ వేణు బాకం విజయసాయి రెడ్డి చేసినవే. నిజానికి, ఆ వ్యాఖ్యలు చెప్పకపోయినా, వైసీపీ నాయకులు కూడా కూటమి బలంగా ఉన్నప్పటి వరకు తమకు విజయం సాధించడం కష్టమే అన్న విషయం అంగీకరిస్తున్నారు.గత ఎన్నికల్లో జనసేన పై కేంద్రీకృత విమర్శలు, వైసీపీ పరోక్ష చర్యల ద్వారా కూటమి బలాన్ని పెంచడమే ప్రధాన వ్యూహంగా నిలిచింది. పవన్ కల్యాణ్ ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, "వైసీపీ కూటమికి బలాన్ని ఇచ్చింది, కాబట్టి కూటమి సరిగా ఉంటే విజయం సాధించగలదు" అని రాజమండ్రిలో ప్రకటించారు. ఎన్నికల సందర్భంలో, వైసీపీ కూటమి బలాన్ని బలపరిచే విధంగా ప్రవర్తించి..తన ఓటమికి స్వయంగా కారణం అయ్యింది.2024 ఎన్నికల్లో కూటమిలో భాగమైన మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో వెళ్లడమే వైసీపీకి సవాల్ గా మారింది అనడంలో డౌట్ లేదు. భవిష్యత్తులో కూడా కూటమి బలంగా ఉండటం వల్ల స్థానిక స్థాయిలో వైసీపీకి ఎదురుదెబ్బలు తగలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ విశ్లేషకులు చెబుతున్న విధంగా, ప్రస్తుత ప్రభుత్వం పై వ్యతిరేకత ఎక్కువగా ఉండటం సాధారణమే. ప్రజలు అందకపోయిన సంక్షేమ కార్యక్రమాల కోసం నిరుత్సాహపడటం సహజమే, కానీ ఇది వైసీపీకి నేరుగా లాభం ఇవ్వడం లేదు.అంచనాల ప్రకారం, వైసీపీ తనకు బలహీనంగా ఉన్న జిల్లాలపై ఎక్కువ దృష్టి పెట్టడం, బలంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ ఫోకస్ పెట్టడం వల్ల, ఓట్ల సమీకరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందువల్ల, ఒక ప్రాంతంలో ఓట్లు తగ్గినా, మరో ప్రాంతంలో వ్యూహాత్మకంగా పనిచేస్తే, అది సమతుల్యంగా బలం సమీకరించగలదు. చంద్రబాబు నాయుడు , పవన్ కల్యాణ్ ( ఇప్పటికే తమ వ్యూహాలు సజావుగా అమలు చేస్తున్నారు.మొత్తంగా, కూటమి బలంగా ఉండడం, స్థానిక వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వైసీపీకి ఛాన్స్ తక్కువగా ఉంది. ఒక ప్రాంతంలో ఓట్లు తక్కువగా రావడం వల్ల వచ్చే నష్టాన్ని మరొక ప్రాంతంలో పూరించగలిగే అవకాశం కూటమికి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో, వైసీపీని అతి జాగ్రత్తగా వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, గతంలో విజయసాయి రెడ్డి అన్న , "కూటమి బలంగా ఉన్నంత వరకు వైసీపీకి విజయం సాధించడం చాలా కష్టం" వ్యాఖ్యలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి అన్న చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో కూటమిని ఎదుర్కోవడానికి వైసీపీ వ్యూహాలు ఎలా పనిచేస్తాయో చూడాలి.

# కలెక్టర్ రంగంలోకి దిగి....

**తిరుపతి, మార్చి 6,పెన్ పవర్:** తిరుపతి జిల్లాలో తహసీల్దారు తీరుపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ భూ సమస్యపై విశ్రాంత సైనికుడు తహసీల్దారుకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆయన కలెక్టర్‌ను కలిశారు.. ఈ క్రమంలో పుల్లంపేట తహసీల్దారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులతోనే నేరుగా అధికారులకు ఫోన్ చేయించగా.. వారు నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో సస్పెండ్ చేస్తానని హెచ్చరించారుతిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తహసీల్దార్‌తో పాటూ రెవెన్యూ సిబ్బంది ఊహించిన షాకిచ్చారు. ఓ విశ్రాంత సైనికుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కలెక్టర్.. ఆ బాధితుడితో అధికారులకు ఫోన్ చేయించి అడ్డంగా బుక్ చేశారు. విశ్వేశ్వరరావు సైనికుడిగా పనిచేశారు.. పదవీ విరమణ తర్వాత పుల్లంపేట ప్రాంతంలో ప్రభుత్వం 5.44 ఎకరాల భూమి కేటాయించింది. అయితే గత 20 ఏళ్లుగా ఈ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు.. బాధితుడు తహసీల్దారు చుట్టూ తిరిగి, తిరిగి విసుగొచ్చింది. ఎన్నిసార్లు వెళ్లి మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విశ్వేశ్వరావు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారుపుల్లంపేట తహసీల్దారు పుల్లారెడ్డి, వీఆర్వో బొమ్మి శ్రీనివాసులు తన సమస్యను పరిష్కరించడం లేదని కలెక్టర్ దగ్గర తన గోడు వెళ్లబోసుకున్నారు విశ్వేశ్వరరావు. వెంటనే స్పందించిన కలెక్టర్.. తన ఎదురుగానే తహసీల్దారుకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయన వెంటనే ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని మరోసారి కోరారు. తహసీల్దారు మరోసారి నిర్లక్ష్యంగానే సమాధానం చెప్పారు. ఆ భూమికి పట్టా ఉన్న సంగతి నిజమే.. కానీ ఆ భూమి మీ ఆధీనంలో లేదు కాబట్టి సర్వే చేయడం కుదరదని తహసీల్దారు అన్నారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్ జోక్యం చేసుకున్నారు. 'విశ్వేశ్వరరావుకు గతంలో ఇచ్చిన పట్టాను రద్దు చేసి మరో ఇవ్వడమో.. ప్రస్తుతం ఇచ్చిన భూమిలో ఆక్రమణలు తొలగించడమో చేయాలి.. పైగా ఆ భూమిని కబ్జా చేసినవారికి మద్దతు తెలుపుతావా' అంటూ కలెక్టర్ తహసీల్దారుపై మండిపడ్డారువిశ్వేశ్వరరావుకు చెందిన భూమి విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని.. భూమిని కబ్జా చేసిన వాళ్లపై కేసు నమోదు చేయాలని తహసీల్దారును ఆదేశించారు కలెక్టర్ వెంకటేశ్వర్. ఈ పని త్వరగా పూర్తిచేయకపోతే.. ఇద్దర్ని సస్పెండ్ చేస్తానని తహసీల్దారు, వీఆర్వోను హెచ్చరించారు. అలాగే రేణిగుంట విమానాశ్రయానికి దగ్గరలో ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ భూమిలో ఒకరు ప్లాట్లు వేస్తున్నారు.. స్థానికుడు ఒకరు స్పందించి వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అయితే రివర్స్‌లో వీఆర్వో నీకేం సంబంధమంటూ స్థానికుడ్ని ప్రశ్నించారు. దీంతో ఆ వ్యక్తి కూడా కలెక్టర్‌ను కలిసి వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ నుంచి మరోసారి వీఆర్వోకు సదరు వ్యక్తి ఫోన్ చేశారు.. ఆయన మళ్లీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఫోన్ తీసుకుని మాట్లాడారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.. వెంటనే ప్లాట్లు వేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టర్ నేరుగా బాధితులతో ఫోన్లు చేయించి అధికారులకు షాకిచ్చారు.. సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ ఊహించని పరిణామంతో అధికారులు అవాక్కయ్యారు.

# క్రిస్టియన్ కార్డు ఎవరికి లాభం... ఎవరికి నష్టం


**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'మతం' చుట్టూ సాగుతున్న రాజకీయం పెను దుమారం రేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒక నిర్దిష్ట మతానికే పరిమితమైన పార్టీగా చిత్రీకరించడంలో తెలుగుదేశం కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా శాసనమండలి వేదికగా జరిగిన పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వైసీపీని తీవ్రమైన ఆత్మరక్షణలో పడేశాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం నుంచి మతపరమైన అంశాల వైపు మళ్లుతోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విశ్వాసాలను ఆసరాగా చేసుకుని, ఆ పార్టీని ఒక క్రిస్టియన్ పార్టీగా ముద్ర వేయడం ద్వారా హిందూ ఓటు బ్యాంకును దూరం చేయాలనేది టీడీపీ పక్కా వ్యూహంగా కనిపిస్తోంది.శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు నేరుగా మండలి చైర్మన్ మోషేన్ రాజు, జగన్మోహన్ రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. తామంతా హిందువులమని, వారు క్రిస్టియన్లని ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. దీనిపై మోషేన్ రాజు తాను హిందువునని స్పష్టం చేయడం, అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పడంతో సభలో ఆ వివాదం ముగిసినట్లు కనిపించినా, అసలు కథ సోషల్ మీడియాలో మొదలైంది.సభలో అచ్చెన్నాయుడు వెనక్కి తగ్గినప్పటికీ, టీడీపీ సోషల్ మీడియా విభాగం మాత్రం మోషేన్ రాజు గతంలో చర్చీల్లో పాల్గొన్న వీడియోలు, ఆయన మతపరమైన నేపథ్యాన్ని సూచించే ఫొటోలను బయటపెట్టింది. "నోటితో హిందువునని చెబుతూ, ఆచరణలో క్రిస్టియానిటీని పాటిస్తున్నారు" అనే అర్థం వచ్చేలా చేస్తున్న ప్రచారం వైసీపీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం వల్ల పార్టీ నాయకత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరగాలని



వైసీపీ పట్టుబట్టింది. ప్రభుత్వం చర్చకు వెనకాడుతోందని ప్రచారం చేసుకున్న వైసీపీకి, తీరా చర్చ మొదలయ్యాక సీన్ రివర్స్ అయ్యింది. చర్చను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైసీపీ సభ్యులు విఫలమయ్యారు. కేవలం సాంకేతిక అంశాల మీద కాకుండా, భావోద్వేగ అంశాల మీద ప్రభుత్వం చేసిన దాడిని వారు తిప్పికొట్టలేకపోయారు. వైసీపీ హయాంలోనే అపవిత్రం జరిగిందని, హిందూ ధర్మంపై ఆ పార్టీకి గౌరవం లేదని మంత్రులు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. జగన్ 'డిక్లరేషన్' అంశాన్ని కూడా దీనికి ముడిపెట్టడంతో, వైసీపీ కేవలం ఒక మతానికే కొమ్ముకాస్తోందనే భావనను కలిగించడంలో టీడీపీ కూటమి సక్సెస్ అయ్యింది.రాజకీయాల్లో ఒకసారి ముద్ర పడితే దాన్ని చెరిపేసుకోవడం చాలా కష్టం. గతంలో బీజేపీపై ఉన్న 'హిందూత్వ' ముద్రను ఆ పార్టీ బలంగా వాడుకోగా, ఇప్పుడు వైసీపీపై పడుతున్న 'క్రిస్టియన్ పార్టీ' ముద్రను టీడీపీ ఎన్నికల అస్త్రంగా మలుచుకుంటోంది. జగన్మోహన్ రెడ్డి తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెబుతున్నా, పార్టీలోని కీలక నేతల మతపరమైన నేపథ్యాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడం ద్వారా వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీనివల్ల తటస్థంగా ఉండే హిందూ ఓటర్లు వైసీపీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. తిరుమల వంటి సున్నితమైన అంశాల్లో తడబడటం, సొంత పార్టీ నేతల మతపరమైన క్లారిటీ లేకపోవడం వైసీపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి.

# మంత్రులు కేరాఫ్ అమరావతి- అంతా రెడీ

**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:** ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని విషయంలో వేగంగా అడుగులు వేస్తోంది. నిర్మాణాలు సైతం ఊపందుకున్నాయి. అమరావతి రాజధానికి సంబంధించిన కార్యక్రమాలు అన్నీ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. నిధులకు కొరత లేకుండా కూడా కూటమి ప్రభుత్వం చూసుకుంటోంది. ఇక ఇప్పటికే అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు తయారు అయిపోయాయి. అదే విధంగా మంత్రులకు సంబంధించిన క్వార్టర్స్ నిర్మాణం కూడా తుది దశకు వచ్చింది అని అంటున్నారు.



**వచ్చే సెషన్ నుంచి :**

ఇదిలా ఉంటే వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి ఏపీకి చెందిన మొత్తం 175 మంది ఎమ్మెల్యేలు, అలాగే 58 ఎమ్మెల్సీలు, మంత్రుల నివాస సముదాయాలు రెడీ అయ్యేలా నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ విషయాన్ని శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొంటూ రాజధానిలోని మంత్రులు సహా అంతా ఇక మీదట క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**పుష్కర కాలం తరువాత :**

హైదరాబాద్ రాజధానిగా ఉండగా మంత్రులు అంతా అక్కడ ప్రభుత్వ క్వార్టర్లలో ఉండేవారు, అదే విధంగా ఎమ్మెల్యేలు కూడా ఉండేవారు. కానీ విభజన తరువాత ఏపీకి రాజధాని లేకపోవడం వల్ల రాజధానికి ఎవరు వచ్చినా ఇబ్బంది అవుతోంది. చాలా చోట్ల ప్రైవేట్ వసతి గృహాలను తీసుకుంటున్నారు. ఇపుడు ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేలా అమరావతి రాజధానిలో నిర్మాణాలు తయారు అవుతున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వ క్వార్టర్లలో ఇక మీదట మంత్రులు శాసనసభ్యులను చూడవచ్చు అని అంటున్నారు.

**మూడేళ్ళలో పూర్తిగా :**

ఇక రానున్న మూడేళ్ళ కాలంలో అమ్రావతి రాజధాని పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రకాల వసతులతో రాజధాని ఒక షేపునకు వస్తుందని అంటున్నారు. దాంతో ప్రభుత్వం తరఫున పూర్తి యాక్టివిటీ అయితే మొదలవుతుంది అని అంటున్నారు. అక్కడ ప్రభుత్వం తరఫున మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అలాగే న్యాయ మూర్తులు, మరో వైపు ప్రభుత్వ ఉద్యోగులు అంతా క్వార్టర్లలో ఉండేందుకు అవసరమైన విధంగా తయారు అవుతుంది. అలాగే ఈ మూడేళ్ళలో ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు కూడా ఒక కొలిక్కి వస్తాయని అంటున్నారు. అలాగే ప్రభుత్వం చాలా చోట్ల ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన స్థలాలలో అభివృద్ధి ప్రాజెక్టులు కూడా వేగంగా తయారు అయ్యేందుకు అవకాశం ఉంది అని అంటున్నారు. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్ లో పెట్టామని మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుందని బాబు చెప్పారు.

**పోలవరం విషయంలో :**

ఇక ఏపీలో జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్ నాటికి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా చేపట్టామని చంద్రబాబు చెప్పారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్ళు ఇస్తామని అన్నారు. ఈ విషయంలో ఎక్కడా లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామని బాబు చెప్పరు. దాంతో పోలవరం అమరావతి రాజధాని రెండూ పూర్తి అయితే ఏపీకి అన్ని విధాలుగా ప్రగతి కనిపిస్తుంది అని అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో అయితే కూటమి ప్రభుత్వం సీరియస్ గానే ముందుకు అడుగులు వేస్తోంది.

## రాజ్యసభకు ఇవాళ నితీష్, రేపు చంద్రబాబేనా? -

**విజయవాడ, మార్చి 6 పెన్ పవర్:** బీహార్ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచిన నితీష్ కుమార్, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడం భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపు. రాజ్యసభ ఎన్నికల్లో ఆయన స్వయంగా నామినేషన్ దాఖలు చేయడంతో, బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడబోతోందనేది స్పష్టమైంది. ఏపీలో కూడా జూన్ లోపు నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు ఉండటంతో.. నెక్ట్స్ చంద్రబాబు కూడా ఢిల్లీకి వెళ్తారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి.చంద్రబాబు నాయుడుకు ప్రస్తుతం 75 ఏళ్లు. నితీష్ కుమార్ కూడా దాదాపు అదే వయస్సులో ఉండటంతో ఈ పోలిక సహజంగానే వస్తోంది. ఏపీలో గత కొంతకాలంగా లోకేష్ ఎలివేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. క్యాబినెట్ సమావేశాల్లో లోకేష్ ప్రాధాన్యత పెరగడం, ముఖ్యమైన శాఖల నిర్వహణ, విదేశీ పర్యటనల్లో రాష్ట్ర ముఖచిత్రంగా మారడం చూస్తుంటే.. ఆయనను సీఎం పీఠంపై కూర్చోబెట్టి బాబు కేంద్రానికి వెళ్తారనే చర్చకు బలం చేకూరుస్తోంది. అయితే, నితీష్ లాగా చంద్రబాబుకు ఇది విశ్రాంతి సమయం కాకపోవచ్చు.బీహార్, ఏపీల మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం బీజేపీ బలం . బీహార్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది, నితీష్ కుమార్ పార్టీ ( జూనియర్ భాగస్వామిగా మారింది. అక్కడ నితీష్ వైదొలగడం బీజేపీకి అనివార్యమైన అవసరం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి భిన్నం. ఇక్కడ బీజేపీ ఒక మైనర్ పార్టీ. చంద్రబాబు నాయుడు కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదు, కూటమికి అసలైన సారథి. బాబు లేకుండా ఏపీలో కూటమి మనుగడ కష్టమని బీజేపీకి కూడా తెలుసని భావిస్తున్నారు. నితీష్ కుమార్ ఇటీవలి కాలంలో కొన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. విచిత్రంగా ప్రవర్తిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనికి భిన్నంగా చంద్రబాబు నాయుడు 75 ఏళ్ల వయస్సులోనూ అత్యంత చురుకుగా పనిచేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పాలనాపరమైన సమీక్షలు, జిల్లాల పర్యటనలతో ఆయన బిజీగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేకపోవడం, ఆయన తన పదవిని వదులుకునే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. చంద్రబాబు నాయుడుకు ఢిల్లీ రాజకీయాలంటే ఎప్పుడూ ఒక రకమైన విముఖత ఉంది. 1996లోనే ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా కాదనుకుని రాష్ట్ర రాజకీయాలకే పరిమితమైన చరిత్ర ఆయనది. ప్రస్తుత పరిస్థితుల్లో అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం ఆయన కలలు. ఇవి ఇంకా ఒక కొలిక్కి రాకుండా ఆయన ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకుంటారన్నది ఊహించలేం. నితీష్ కుమార్ లాగా అన్ని సభల్లో సభ్యుడిగా ఉండాలి అనే వ్యక్తిగత మైలురాళ్ల కంటే, రాష్ట్ర పునర్నిర్మాణమే బాబు ప్రాధాన్యత.లోకేష్ ముఖ్యమంత్రి అవుతారనే చర్చ నిజమే అయినప్పటికీ, అది చంద్రబాబును ఢిల్లీకి పంపడం ద్వారా జరుగుతుందా అనేది అనుమానమే. చంద్రబాబు కనీసం 2029 వరకు ముఖ్యమంత్రిగా ఉండి, పాలనలో లోకేష్‌కు పూర్తి పట్టు వచ్చాక, పార్టీ శ్రేణులు , కూటమి భాగస్వామి పవన్ కళ్యాణ్ అంగీకారంతోనే మార్పు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ అనిశ్చితిలో బాబు తప్పుకుంటే అది కూటమికి నష్టం చేస్తుందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అమెరికా మరియు ఇండియా మధ్య భారీగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా, భారత్ మధ్య నడిచే ప్రధాన రూట్లలో విమాన టికెట్ ధరలు భారీగా పెరిగాయి. యుద్ధ మేఘాల కారణంగా కీలకమైన గగనతల మార్గాలను మూసివేయడంతో, విమానయాన సంస్థలు తమ సర్వీసులను వేరే రూట్ల ద్వారా మళ్లిస్తుండటం, మరికొన్ని సర్వీసులను రద్దు చేయడమే ఇందుకు ప్రధాన కారణం.సాధారణంగా అమెరికా, యూరప్, ఆసియా ఖండాలను అనుసంధానించే ప్రధాన కేంద్రంగా మధ్యప్రాచ్యం ఉంటుంది. అయితే తాజా సంఘర్షణల నేపథ్యంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లేందుకు విమానయాన సంస్థలు వెనకాడుతున్నాయి. ఫ్లైట్ రాడార్ 24 డేటా ప్రకారం, ఒకప్పుడు విమానాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు చాలా వరకు ఖాళీగా కనిపిస్తోంది. సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళుతుండటంతో ప్రయాణ సమయం, ఖర్చు పెరిగి ఆ భారం ప్రయాణికులపై పడుతోంది.గూగుల్ ఫ్లైట్స్ తాజా గణాంకాల ప్రకారం న్యూయార్క్, షికాగో, నెవార్క్ వంటి నగరాల నుంచి ముంబై, న్యూఢిల్లీలకు వచ్చే విమాన టికెట్ల రేట్లు అమాంతం పెరిగాయి.ముఖ్యంగా న్యూయార్క్ నుంచి న్యూఢిల్లీకి వచ్చే విమానాల్లో టికెట్ ధరలు ప్రస్తుతం రూ. 1.34 లక్షల నుంచి రూ. 2.25 లక్షల వరకు పలుకుతున్నాయి. సాధారణ రోజుల్లో ఇవి రూ. 45 వేల నుంచి రూ. 1 లక్ష మధ్య ఉంటాయి. అంటే 100 శాతానికి పైగా ధరలు పెరిగాయి.షికాగో నుంచి వచ్చే విమానాల్లో ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. షికాగో – ముంబై రూట్‌లో టికెట్ ధరలు ఏకంగా 150 శాతం పెరిగి, రూ. 1.9 లక్షల నుంచి రూ. 2.8 లక్షల వరకు చేరాయి. సాధారణంగా ఈ రూట్‌లో రూ. 45 వేల నుంచి రూ. 75 వేలకే టికెట్లు లభిస్తాయి. అలాగే నెవార్క్ – ముంబై, షికాగో – ఢిల్లీ రూట్లలో కూడా టికెట్ ధరలు రెట్టింపు అవ్వడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇండియా తనే ఓ శక్తిగా ఎదగాలి సింగపూర్ మాజీ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు

భారత్, చైనా సంబంధాలపై సింగపూర్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి జార్జ్ యెవో యాంగ్ బూన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనాతో సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడం భారత్‌కు వ్యూహాత్మకంగా ప్రయోజనం కలిగిస్తుందని.. అలా చేయడం చైనాకు కూడా ప్రయోజనకరమని బూన్ తెలిపారు. ఆగ్నేయాసియా దేశాల కోణంలో చూస్తే.. భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు తల్లిదండ్రులు గొడవ పడుతున్నట్లుగా ఉంటుంది. దీనివల్ల ఏ ఒక్కరూ ప్రశాంతంగా ఉండలేరు. భారత్, చైనా మధ్య గొడవలు లేకుండా, మంచి సామరస్యంతో కూడిన సంబంధాలను చూడాలని ఆగ్నేయాసియా దేశాలు కోరుకుంటున్నాయని యెవో చెప్పారు. ఆసియా ఖండంలో మారుతున్న వ్యూహాత్మక పరిణామాలను చాలా కాలంగా పరిశీలిస్తూన్న యెవోను భారత ప్రభుత్వం 2012లోనే పద్మ భూషణ్ పురస్కారంతో గౌరవించింది."అమెరికా వైపు మొగ్గు చూపడం వల్ల భారత్ ఎక్కువగా ప్రయోజనం పొందొచ్చనే అభిప్రాయం గతంలో ఉండేది. కానీ అమెరికాతోనూ భారత్ సంబంధాలు సంక్లిష్టంగానే ఉన్నాయని ఇప్పుడు స్పష్టమవుతోంది. చైనాతోపాటు, ఇతర ప్రధాన దేశాలతో తన సంబంధాలను భారత్ ఎంతో జాగ్రత్తగా మేనేజ్ చేసుకోవాలి" అని యెవో సూచించారు. భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడం, వీసాలపై ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో సింగపూర్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్ తన ఇండో–పసిఫిక్ వ్యూహంలో భాగంగా ఏదో ఒక పక్షం (చైనా, అమెరికాల్లో) వహించకూడదు. ఈ విశాల ప్రాంతంలో స్థిరత్వాన్ని కాపాడే శక్తిగా, శాంతి స్థాపకుడిగా తనను తాను మలుచుకోవాలి.. ఇదే భారత్‌కు అత్యంత తెలివైన ఇండో–పసిఫిక్ వ్యూహం అవుతుంది' అని యెవో అభిప్రాయపడ్డారు. భారతదేశం యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకున్న తరహాలోనే.. ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియా దేశాలతోనూ ఒప్పందం కుదుర్చుకోవాలి. దీని వల్ల దీర్ఘకాలిక వాణిజ్య పురోగతి గణనీయంగా మెరుగవుతుందని యెవో తెలిపారు.

## అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రతరం.. చైనా మధ్యవర్తిత్వం ఆఫర్



గతవారం నుంచి అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకున్న ఉద్రిక్తతలకు దౌత్యపరంగా పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. యుద్ధంపై ఇప్పటికే భారత్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.పోరాటాన్ని ముగించడానికి తాము మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నామని, సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. యూఏఈ ఉప–ప్రధాని అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో సహా గల్ఫ్‌లోని ఉన్న రాజకీయ నాయకులతో ఫోన్‌లో తమ విదేశాంగ మంత్రి వాంగ్ యీ సంభాషణలు జరిపారని లిన్ చెప్పారు. జాతీయ భద్రతను కాపాడుకునే విషయంలో యూఏఈకి చైనా మద్దతు ఇస్తుందని, దౌత్యం ద్వారా ఈ వివాదాన్ని పరిష్కరించుకునేలా ఇతర గల్ఫ్ దేశాలకు కూడా మద్దతు ఇస్తుందని వాంగ్ యీ అన్నారు. "యుద్ధం వల్ల ప్రజలు మాత్రమే నష్టపోతారు.. శాంతి కోసం చైనా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూనే ఉంటుంది" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. శాంతి ప్రక్రియ కోసం ప్రత్యేక రాయబారిని పంపే ప్రణాళికలను ధ్రువీకరించింది. సౌదీ అరేబియా దౌత్యవేత్త ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్‌తో కూడా తమ ప్రతినిది మాట్లాడారని పేర్కొంది. ఈ సందర్భంగా కీలకమైన రాస్ తనూరా రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడుల తర్వాత సౌదీ సంయమనాన్ని, ఈ వివాదం శాంతియుత పరిష్కారానికి దాని నిబద్ధతను ఆయన ప్రశంసించారని చైనా రాయబార కార్యాలయం తెలిపింది. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం వల్ల సౌదీ సహా ఇతర గల్ఫ్ దేశాలు ప్రభావితం అవుతున్నాయని పేర్కొంది. రష్యా, ఒమన్, ఫ్రాన్స్‌లతో పాటు ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతినిధులతోనూ చైనా విదేశాంగ మంత్రి మాట్లాడారు.

## ఖమేనీ అడ్డు తొలగించాలని నవంబర్‌లోనే నిర్ణయించుకొన్నాం

అమెరికా– ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక విషయాలు బయటపెట్టారు. సుప్రీం నేత అడ్డు తొలగించాలని తాము గతేడాది నవంబర్‌లోనే నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది చివర్లో ఓ ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగిందని కట్జ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఖమేనీ అడ్డు తొలగించాలని గట్టిగా నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ (ఎతీజీని)పై కొనసాగుతున్న ఆపరేషన్.. 2026 మధ్యలో జరగాల్సి ఉందన్నారు. అప్పట్లో ఈ ప్రణాళిక గురించి అమెరికాకు వెల్లడించలేదన్నారు. ఇటీవల ఇరాన్ పాలనను వ్యతిరేకిస్తూ ఆ దేశంలో నిరసనలు జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు (ట్రంప్ ), నెతన్యాహుల మధ్య దీని గురించి చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇరుదేశాలు సంయుక్తంగా ముందుగానే ఆపరేషన్ మొదలుపెట్టినట్లు వెల్లడించారు.

# భారత స్థావరాల నుంచే ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తోందా

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధంలో ఇరాన్‌పై దాడులకు భారత్ నౌకదళ స్థావరాలను అమెరికా ఉపయోగించుకుంటోందని ఆరోపించిన నివేదికలను న్యూఢిల్లీ తోసిపుచ్చింది. ఇవి పూర్తిగా నిరాధారమైనవని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. యూఎస్ ఆర్మీ మాజీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రేగర్ అమెరికా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇరాన్‌పై యుద్ధానికి భారత నౌకాదళ స్థావరాలను అమెరికా వినియోగించకుందని ఆరోపించారు. బుధవారం శ్రీలంకలోని గాలె వద్ద హిందూ మహా సముద్రంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరెస్ డెన్‌ను జలాంతర్గామితో అమెరికా దాడిచేసి ముంచేసింది. ఈ ఘటనలో 150 మంది గల్లంతుకాగా.. మరో 32 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో భారత్ పోర్టు నుంచే దాడి జరిగిందనే ప్రచారం జరుగుతోంది. 'మా స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ మౌలిక సౌకర్యాలు నాశమయ్యాయి. వాస్తవానికి భారత్, భారత నౌకాశ్రయాలపై మేము ఆధారపడాల్సి వస్తోంది. ఇది అంత మంచిది కాదని మా నేవీ అంటోంది' అని ఆయన ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. ఈ వ్యాఖ్యలపై భారత్ స్పందిస్తూ.. 'ఇలాంటి నిరాధారమైన, కల్పిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి' అని కౌంటర్ ఇచ్చింది. పశ్చిమాసియాలో యుద్ధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోన్న భారత్.. పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇరు వర్గాలూ సంయమనం పాటించి ఉద్రిక్తతలు తగ్గించాలని కోరుతోంది. గతవారం ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త ఆపరేషన్ చేపట్టి ఇరాన్‌పై దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ సహా కీలక నాయకులు, అధికారులు మరణించారు. దీనికి ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలోనే అమెరికా.. శ్రీలంక తీరం సమీపంలో ఇరాన్ యుద్ధ నౌకపై దాడిచేసి ముంచేసింది. ఇప్పటి వరకూ 87 మృతదేహాలను వెలికితీశారు. గత నెల విశాఖపట్నంలో జరిగిన మిలాన్ 2026 కోసం వచ్చిన ఈ నౌక.. స్వదేశానికి తిరిగి వెళ్తున్న సమయంలోనే దాడికి గురయ్యింది.

# యుద్ధం ఎఫెక్ట్.. ఒక్కసారిగా పెరిగిన వంటనూనె ధరలు



న్యూఢిల్లీ: ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావంతో భారత్‌లో వంటనూనె ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గత వారం వరకు స్థిరంగా ఉన్న ధరలు ఈ వారం లీటర్‌కు రూ.4–5 వరకు పెరిగాయి. మార్కెట్ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో రూ.10–15 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గోల్డ్ విన్నర్, సన్ ప్యూర్, ఫార్చ్యూన్, సఫోలా, సన్‌డ్రాప్ వంటి బ్రాండ్ల ధరలు పెరిగాయి. వంట నూనె ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగానే వీటి ధరలు పెరుగున్నాయి. ఈ యుద్ధం ముఖ్యంగా సముద్ర మార్గాలపై ప్రభావం చూపుతోంది. భారత్‌కు అవసరమైన వంట నూనెలలో చాలా వరకు విదేశాల నుంచి దిగుమతి అవుతుంది. ముఖ్యంగా సన్‌ఫ్లవర్ నూనె, పామ్ ఆయిల్ వంటి నూనెలను ఉక్రెయిన్, రష్యా, ఇండోనేషియా, మలేషియా, మధ్యప్రాచ్య ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.యుద్ధ పరిస్థితుల కారణంగా ఆయా దేశాల నుంచి వచ్చే నౌకాశ్రయ రవాణా పూర్తిగా స్తంభించింది. ప్రత్యేకంగా హార్ముజ్ జలసంధి ద్వారా వచ్చే నౌకల రాకపోకలు ప్రభావితమయ్యాయి. ఈ మార్గం ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైనది. అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే ఈ మార్గంలో ఉద్రిక్తతలు పెరగడంతో నౌకలు ఆలస్యం అవుతున్నాయి. కొన్ని నౌకలను ఇరాన్ ప్రాంతం చుట్టూ నిలిపివేయడం కూడా జరిగింది.

# కేంద్ర మంత్రి అమిత్ షా సమక్షంలో నితీశ్ కుమార్ రాజ్యసభ నామినేషన్



బీహార్: బిహార్ రాజకీయాల్లో మరోసారి పెను మార్పులు సంభవించబోతున్నాయనే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి.

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈరోజు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో రాజ్యసభకు నామినేషన్ వేసే అవకాశం ఉందని జాతీయ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.ఎన్డీయే కూటమి శ్రేణులతో కీలక భేటీ నిర్వహించేందుకు అమిత్ షా నేడు బిహార్‌కు రానుండటంతో, ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల నుంచి నితీశ్ కేంద్ర రాజకీయాల వైపు అడుగులు వేయబోతున్నారనే వార్తలు ఇప్పుడు పట్నా నుంచి ఢిల్లీ వరకు హాట్ టాపిక్‌గా మారాయి. అమిత్ షా పర్యటన సందర్భంగా బిహార్ బీజేపీ చీఫ్ నితిన్ నబీన్‌తో పాటు నితీశ్ కుమార్ కూడా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ పరిణామం గనుక నిజమైతే, బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కొత్త వ్యక్తి కూర్చునే అవకాశం ఉంటుంది.

గత కొంతకాలంగా నితీశ్ కుమార్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో, అమిత్ షా సమక్షంలో జరగబోయే ఈ కార్యక్రమం ఎన్డీయే కూటమిలో ఆయన స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ కీలక నిర్ణయంపై జనతాదళ్ (యునైటెడ్) పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జేడీయూలోని ఒక వర్గం నితీశ్ కుమార్ రాష్ట్ర రాజకీయాలను వదిలి వెళ్లడంపై సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగితేనే పార్టీకి, రాష్ట్రానికి మేలు జరుగుతుందని వారు వాదిస్తున్నారు. పార్టీలో అంతర్గతంగా వ్యక్తమవుతున్న ఈ అసమ్మతిని నితీశ్ ఎలా అధిగమిస్తారు? తన నిర్ణయాన్ని పార్టీ శ్రేణులకు ఎలా వివరిస్తారు? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

## పశ్చిమాసియాపై మోదీ మౌనం దేశానికే ముప్పు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు భారత్ గడప వరకు చేరుతున్నా ప్రధాని మోదీ మౌనం వీడకపోవడం ఆందోళనకరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం విమర్శించారు. ఇటువంటి క్లిష్ట సమయంలో దేశం తరఫున ధైర్యంగా నిలబడి మాట్లాడగలిగే నాయకుడు కావాలని ఆయన వ్యాఖ్యానించారు. 'శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచేయడంతో యుద్ధం మన సరిహద్దు వరకూ వచ్చింది. మన చమురు దిగుమతుల్లో 40 శాతానికి పైగా రవాణా జరిగే హర్మూజ్ జలసంధి మార్గంలో ఉద్రిక్తతలు పెరగడం ఆందోళనకరం. ఈ పరిణామాలు ముడి చమురు, సహజ వాయువు సరఫరాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం యావత్ ప్రపంచం అనిశ్చితిలో ఉంది. రాబోయేది కష్టకాలం. ఇటువంటి పరిస్థితుల్లో ప్రధాని నోరు విప్పకపోవడం దేశ భద్రతకే ముప్పు' అని 'ఎక్స్' వేదికగా రాహుల్ హెచ్చరించారు. భారత వ్యూహాత్మక, జాతీయ ప్రయోజనాలపై మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంగ్భ్రాంతికరమని, ఇంతకు ముందెన్నడూ భారత్ ఇలా ప్రవర్తించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. భారత్ నేతృత్వంలో నిర్వహించిన యుద్ధ విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళ్తున్న ఇరాన్ నౌకను హిందూ మహాసముద్రంలో అమెరికా ముంచివేయడాన్ని సీపీఐ(ఎం), నేషనల్ కాన్ఫరెన్స్, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతలు ఖండించారు. ఇరాన్ నౌకపై దాడిని యుద్ధ విన్యాసాలు నిర్వహించే భారతదేశ హక్కుపై దాడిగా పేర్కొన్నారు.

## అస్సాంలో కూలిన సుఖోయ్.. ఇద్దరు పైలెట్లు మృతిచెందినట్లు ఐఏఎఫ్ నిర్ధారణ





న్యూఢిల్లీ: సుఖోయ్ ఎస్‌యూ–30 ఎంకేఐ ఫైటర్ జెట్ కూలినట్లు భారతీయ వైమానిక దళం ప్రకటించింది. ఆ ప్రమాదంలో ఇద్దరు వైమానిక దళ పైలెట్లు మృతిచెందినట్లు ఐఏఎఫ్ కన్ఫర్మ్ చేసింది.అస్సాంలోని కర్బి ఆంగ్‌లాంగ్ జిల్లాలో సుఖోయ్ కూలింది. ప్రమాదంలో మృతిచెందిన పైలెట్లను స్క్వాడ్రన్ లీడర్ అనుజ్, ఫ్లయిట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దుర్గాకర్‌గా గుర్తించారు. ఐఏఎఫ్ దళ సభ్యులందరూ ఆ పైలెట్ల మృతి పట్ల సంతాపం చెబుతున్నారని ఐఏఎఫ్ తన ఎక్స్ అకౌంట్‌లో వెల్లడించింది. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా గురువారం సుఖోయ్–ఎస్‌యూ–30 ఎంకేఐ యుద్ధ విమానం గగనతలంలోకి ఎగిరింది. అయితే జోర్‌హాట్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఆ విమానం రేడార్ నుంచి అదృశ్యమైంది. ఎయిర్‌బేస్ నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో సుఖోయ్ యుద్ధ విమానం కూలినట్లు గుర్తించారు. రాత్రి 7.42 నిమిషాలకు ఆ విమానంతో కమ్యూనికేషన్

దెబ్బతిన్నది. సమీప కొండ ప్రాంతంలో కూలినట్లు తేల్చారు. కొండ మీద నుంచి భారీ స్థాయిలో శబ్దం వచ్చినట్లు స్థానిక గ్రామస్తులు తెలిపారు. మంటలు కూడా వ్యాపించినట్లు చెప్పారు. సుఖోయ్ ఎస్‌యూ–30 ఎంకేఐ ఫైటర్ జెట్.. టూ సీటర్ ఇంజిన్. రష్యా విమాన తయారీ కంపెనీ సుఖోయ్ దీన్ని డెవలప్ చేసింది. లాంగ్ రేంజ్ ఫైటర్ జెట్‌గా దీన్ని గుర్తించారు. ప్రస్తుం హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కంపెనీ లైసెన్సు కింద ఆ యుద్ధ విమానాన్ని నిర్మిస్తున్నారు.

# వేసవి కాలంలో గుడ్ల ధరల తగ్గుదల



కోడిగుడ్డు ధరలు భారీగా తగ్గాయి. సాధారణంగా వేసవి కాలంలో గుడ్ల ధరలు తగ్గుతుంటాయి. కానీ ఈసారి ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా ఒక్కసారిగా దారుణంగా పతనమయ్యాయి. పరస్పర దాడులతో పశ్చిమాసియా రగులుతోంది. ఆరు రోజులుగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా దేశాలు పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. దీనితో ఎక్కడికక్కడ ఎగుమతులు నిలిచిపోవడం కూడా గుడ్ల ధరలు పడిపోవడానికి కారణం.ఎగుమతులు నిలిచిపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమకు భారీ మొత్తంలో నష్టం చేకూరుతుంది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు మూసివేయడం పౌల్ట్రీ పరిశ్రమపై భారీ ప్రభావం పడుతోంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ధర రూ.4.20కి పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో గుడ్డు ధర రూ.3.30కి కూడా పడిపోయింది.

# బేర్ గుప్పిట్లో దలాల్ స్ట్రీట్



ఇరాన్ యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి.
గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలోనే ఇన్వెస్టర్లు ఏకంగా రూ. 21.29 లక్షల కోట్ల సంపదను కోల్పోవడం మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.
మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసుపై ప్రభావం చూపుతాయన్న భయంతో మదుపర్లు తమ షేర్లను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. గత శనివారం యుద్ధం మొదలైనప్పటికీ, మధ్యలో ఆదివారం మరియు మంగళవారం హోలీ పండగ సందర్భంగా మార్కెట్లకు సెలవులు రావడం ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. ఒకవేళ ఆ రోజుల్లో కూడా ట్రేడింగ్ జరిగి ఉంటే నష్టాల తీవ్రత ఇంకా భయంకరంగా ఉండేదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరామం లభించినప్పటికీ, అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా లేకపోవడంతో మార్కెట్ సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతింది. యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసేలా కనిపించకపోవడం, ఎగుమతులు మరియు దిగుమతులపై ఆంక్షలు కఠినతరం కావడం మరో ప్రధాన ఆందోళనగా మారింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం భయాలు పెరిగిపోయాయి. ఈ అనిశ్చితి వల్ల విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు, ఇది దేశీయ మార్కెట్లపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే, రాబోయే సెషన్లలో కూడా 'బేర్' హవా కొనసాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులు వెనకడుగు వేస్తుండటంతో సూచీలు మరింత దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచి తూచి అడుగులు వేయాలని, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# అమెజాన్‌లో మరోసారి లేఆఫ్స్ ప్రక్రియ




ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి లేఆఫ్స్ ప్రక్రియ చేపట్టింది. ఈ ఏడాది జనవరిలో 16 వేలకు పైగా ఉద్యోగులను తొలగించిన కంపెనీ, తాజాగా రోబోటిక్స్ యూనిట్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇంటికి సాగనంపింది.దాదాపు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై దీని ప్రభావం ఉండొచ్చని రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. తాజా తొలగింపులు కంపెనీకి చెందిన వేర్‌హౌస్ నెట్‌వర్క్‌లో ఉపయోగించే వేర్‌హౌస్ రోబోట్లు, ఆటోమేషన్ సిస్టమ్‌లను రూపొందించే టీమ్స్‌లోని ఉద్యోగులపై వేటు పడింది. వీరు వేర్‌హౌస్‌లో పనులను ఆటోమేట్ చేసే రోబోలను డిజైన్ చేస్తారు. గతేడాది కంపెనీ వేర్‌హౌస్ ఉద్యోగులకు సహాయంగా బ్లూజే రోబోటిక్ విభాగాన్ని లాంచ్ చేసింది. కానీ, ఈ ప్రక్రియకు ఎక్కువ ఖర్చు అవుతుందనే కారణంతో అమెజాన్ వీటి తయారీని ఆపేసింది. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడానికి ఈ విభాగంలో సమీక్ష చేపడతామని కంపెనీ అధికారిక ప్రకటనలో తెలిపింది. కానీ, ప్రస్తుతం ఎంతమందిని తొలగించిందనే విషయంపై అమెజాన్ స్పష్టత ఇవ్వలేదు. కాగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగం అత్యంత వేగంగా పెరగడంతో అమెజాన్ గతేడాది ఆఖర్లో 14 వేల మందిని, ఈ ఏడాది ప్రారంభంలో మరో 16 వేల మందిని తొలగించిన సంగతి తెలిసిందే.

# పడిపోయిన బియ్యం ధరలు..



గత 72 గంటల్లోనే బాస్మతీ బియ్యం ధరలు దేశీయ మార్కెట్లో 7-10 శాతం మేర పడిపోవడంతో ఎగుమతిదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎగుమతి రవాణా ఖర్చులు 20 శాతం పెరగడమే కాకుండా నౌకల ఇంధన ధర టన్నుకు 520 నుండి 580 డాలర్లకు చేరడం, యుద్ధ రిస్క్ కారణంగా ఇన్సూరెన్స్ ప్రీమియంలు భారమవ్వడంతో ఎగుమతిదారుల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైంది. నౌకలు రద్దయినప్పుడు లేదా సరుకు నిలిచిపోయినప్పుడు పోర్టుల్లో వసూలు చేసే స్టోరేజ్, డెమరేజ్ ఛార్జీలను వెంటనే మాఫీ చేయాలని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఇఎఫ్) కేంద్రాన్ని కోరింది. అదే విధంగా కోవిడ్ సమయంలో ఇచ్చిన విధంగానే వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, బ్యాంకింగ్ వెసులుబాటు కల్పించాలని డిమాండ చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వేల కోట్ల రూపాయల విదేశీ వాణిజ్యం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

# క్రెడిట్ స్కోర్ లేకుంటే.. బ్యాంకులు హోమ్ లోన్ ఇస్తాయా




సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. అయితే, ప్రస్తుత రోజుల్లో ఇల్లు నిర్మించాలన్నా, కట్టిన ఇల్లు కొనుగోలు చేయాలన్నా లక్షల నుంచి కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.దీంతో తప్పనిసరిగా బ్యాంకులో లోన్ తీసుకోవాల్సి వస్తోంది. అయితే, బ్యాంకుకు వెళ్లినప్పుడు చాలా మందికి ఎదురయ్యే సమస్య క్రెడిట్ స్కోర్. అసలు గతంలో ఎప్పుడూ లోన్ తీసుకోని వారికి క్రెడిట్ స్కోర్ అనేది ఉండదు. మరి అటువంటి వారికి బ్యాంకులు లోన్ ఇవ్వవా? కేవలం సిబిల్ స్కోర్ లేదన్న కారణంతో అప్లికేషన్ తిరస్కరించవచ్చా? దీనిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఏం చెబుతున్నాయి? అనే వివరాలు తెలుసుకుందాం. చాలా మంది క్రెడిట్ స్కోర్ లేకపోతే బ్యాంకులో లోన్ రాదని భావిస్తుంటారు. అయితే, ఇది ముమ్మాటికీ అపోహే. వాస్తవానికి మొదటి సారి లోన్ తీసుకునే వారిని న్యూ టూ క్రెడిట్ (ఎన్‌టీసీ) కేటగిరీగా పరిగణిస్తారు. వీరు క్రెడిట్ రిపోర్టులో స్కోర్ సున్నా లేదా మైనస్ వన్ అని కనిపిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఏ బ్యాంకు కూడా కేవలం క్రెడిట్ హిస్టరీ లేదన్న కారణంతో లోన్ అప్లికేషన్ తిరస్కరించకూడదు. 2025-26 నాటి తాజా బ్యాంకింగ్ రూల్స్ ప్రకారం మొదటిసారి లోన్ కావాలని కోరేవారికి ఫైనాన్ష్ ఇన్‌క్లూషన్‌లో భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం, ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించాయి. క్రెడిట్ స్కోర్ లేని సమయంలో బ్యాంకులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మీ ఆర్థిక స్తోమతను అంచనా వేస్తాయి. రుణ గ్రహీత నెలవారీ శాలరీ స్లిప్పులు, బ్యాంక్ స్టేట్ మెంట్స్, కనీసం రెండేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు పరిగణనలోకి తీసుకుంటాయి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం లేదా వ్యాపారంలో ఎంత కాలం నుంచి ఉన్నారు, కంపెనీకి ఉన్న గుర్తింపు ఏమిటి, అనేవి లెక్కలోకి తీసుకుంటారు. 2026 నాటి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.30 లక్షల లోపు హోమ్ లోన్లకు ఆస్తి విలువలో 90 శాతం వరకు లోన్ పొందే అవకాశం ఉంటుంది. ఆస్తి పత్రాలు క్లియర్ గా ఉంటే బ్యాంకులు ఈజీగానే లోన్ ఇస్తాయి. హోమ్ లోన్ ఈజీగా రావాలంటే కో అప్లికెంట్ సమర్థవంతంగా పని చేస్తుంది. మీ భార్య లేదా తల్లిదండ్రుల్లో ఎవరికైనా మంచి క్రెడిట్ స్కోర్ ఉంటే వారిని కో అప్లికెంట్ గా చేర్చుకోవడం ద్వారా లోన్ త్వరగా వస్తుంది. మరోవైపు కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు క్రెడిట్ స్కోర్ లేని వారికి ప్రత్యేక పథకాల కింద రుణాలు ఇస్తాయి. అయితే వీటిల్లో వడ్డీ రేట్లు బ్యాంకుల కంటే ఎక్కువగా ఉంటాయి. అలాగే మీరు కొనే ఇంటి ధరలో ఎక్కువ శాతం అంటే దాదాపు 30 శాతం వరకు మీరు డౌన్ పేమెంట్ చెల్లిస్తే బ్యాంకులు రిస్క్ తక్కువగా భావించి మిగితా డబ్బులను లోన్ గా ఇస్తాయి.

# ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు:





మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో తగినంత ముడి చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయి. దేశంలో ఇంధన కొరత విషయంలో ఆందోళనలకు తెర దించుతూ పెట్రోల్, డీజిల్ గురించి ఎలాంటి నిబంధనలు విధించడంలేదని, దేశంలో కావాల్సిన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు కాబట్టి, ప్రజలు, పరిశ్రమలకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రత గురించి ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నాం, నిల్వలు రోజూ భర్తీ అవుతున్నాయి. ప్రధానంగా ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ, ముడి చమురు సరఫరాకు ఎలాంటి సమస్యా లేదు. ప్రాధాన్యతా రంగాలకు గ్యాస్ సరఫరా నిరంతరం అందించడానికి గెయిల్ అవసరమైతే ఫోర్స్ మెజ్యూర్ ప్రకటించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ నిబంధన కింద అనూహ్య పరిస్థితులు ఎదురైతే ఒప్పందాన్ని పాజ్ చేయవచ్చు. భారత్‌కు పంపించాల్సిన ఎల్ఎన్‌జీ విషయంలో ఖతార్ ఇదే విధానాన్ని అమలు చేసింది. ప్రస్తుతం మనకు ఖతార్ రోజుకు 60 మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల(ఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ను సరఫరా చేస్తోంది. అలాగే, ప్రపంచ అవసరాల్లో 20 శాతం మేర సరఫరా చేస్తోంది. అయితే, భారత్‌కు మొత్తం 195 ఎంఎస్‌సీఎండీ) దిగుమతులు అవసరం. కాబట్టి, మనదేశానికి కావాల్సిన గ్యాస్ కోసం ఇతర మార్కెట్లనూ అన్వేషిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల మధ్య భారత్ ప్రత్యామ్నాయ వనరులపైనా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కెనడా, ఆస్ట్రేలియాలు గ్యాస్ సరఫరాకు అంగీకరించాయి. కొత్తగా జరిగిన ఒప్పందాల కింద యూఏఈ, అమెరికా నుంచి కూడా సమీకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ ఒక దేశంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి లేదు. అంతర్జాతీయంగా ఇబ్బందులు తలెత్తకుండా పలు కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయి. యుద్ధం కారణంగా పెరుగుతున్న నౌకల బీమా సౌకర్యాలపైనా అమెరికాతో చర్చలు జరుపుతున్నాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నౌకలకు తక్కువ ధరకు బీమా కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

# ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌ను తానే ఆమోదించాలన్న అమెరికా అధ్యక్షుడు



ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌ను తానే స్వయంగా ఆమోదించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి దాడుల్లో ఇరాన్ అగ్రనేత అయాతుల్లా అలీ ఖమేనీ టెహ్రాన్‌లో మరణించిన నేపథ్యంలో,ఆయన వారసుడి ఎంపికపై ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. యాక్సియోస్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా నియమించడాన్ని తాను అంగీకరించనని స్పష్టం చేశారు. "ఇరాన్‌కు శాంతి, సామరస్యాన్ని తీసుకొచ్చే వ్యక్తి కావాలి. ఖమేనీ విధానాలనే కొనసాగించే వ్యక్తి వస్తే, మరో ఐదేళ్లలో మళ్లీ యుద్ధం చేయాల్సి వస్తుంది. ఖమేనీ కుమారుడు ఒక పనికిరాని వ్యక్తి. వెనిజులాలో డెల్సీ రోడ్రిగ్జ్‌ను మధ్యంతర అధ్యక్షురాలిగా నియమించిన తరహాలోనే, ఇక్కడ కూడా నేను కచ్చితంగా జోక్యం చేసుకుంటాను" అని ట్రంప్ అన్నారు.మొజ్తబా ఖమేనీ, తన తండ్రి తర్వాత సుప్రీం లీడర్ పదవికి ప్రధాన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. అయితే, వారసత్వంగా ఈ పదవిని చేపట్టడాన్ని 2024లోనే అలీ ఖమేనీ వ్యతిరేకించారు. బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ కథనం ప్రకారం, మొజ్తబా ఖొమైనీకి 100 మిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్నట్లు అంచనా. కాగా, ప్రభుత్వంలో ఎలాంటి పదవిలో లేకపోయినా తన తండ్రి కార్యాలయంలో పనిచేస్తూ ఆయనకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ 2019లోనే ట్రంప్ ప్రభుత్వం మొజ్తబాపై ఆంక్షలు విధించింది.మరోవైపు ఇరాన్‌లో అధికార మార్పు తమ లక్ష్యం కాదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. ఇరాన్ క్షిపణి వ్యవస్థ, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, అణ్వాయుధాలు లేకుండా చూడటమే తమ ఆపరేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు.ఇదే సమయంలో ఇరాన్ చివరి చక్రవర్తి కుమారుడైన రెజా పహ్లవి తాను తాత్కాలిక నేతగా తిరిగి వస్తానని, ఆ తర్వాత ఇరాన్‌ను లౌకిక ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దేందుకు కొత్త రాజ్యాంగం రూపొందించాలని ప్రతిపాదించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ కింద ఏ కొత్త నాయకుడు వచ్చినా చట్టబద్ధత ఉండదని ఆయన పేర్కొన్నారు. ఖమేనీ మరణంతో ఇరాన్ నాయకత్వంపై నెలకొన్న అనిశ్చితి, ట్రంప్ వ్యాఖ్యలతో మరింత తీవ్రరూపం దాల్చింది.

# అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌పై ఈడీ దాడులు



ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీ కి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అనిల్ అంబానీ (గ్రూప్ ) కంపెనీ రిలయన్స్ పవర్‌కు సంబంధించి ముంబయి, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఅ) సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా 15 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ ఫిబ్రవరి 27న ఈడీ విచారణకు హాజరుకావాల్సిఉంది. అయితే ఆయన గైర్హాజరైన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై ఈడీ కేసు నమోదైంది. వీటి మొత్తం విలువ రూ.40వేల కోట్లుగా పేర్కొంది.

## ఒకే ఒక్క స్ట్రైక్‌తో.. అగ్రరాజ్యానికి పది వేల కోట్లు నష్టం?

ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాలుస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా అధునాతన బాంబర్లు, క్షిపణులు, స్టెల్త్ ఫైటర్లను ప్రయోగిస్తూ శత్రువును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.అయితే ఇరాన్ సైతం తగ్గడం లేదు. తమ సుప్రీం పాలకుడు మరణించినప్పటికీ, తన దగ్గర ఆయుధ సంపత్తి తక్కువగా ఉన్నప్పటికీ, టెహ్రాన్ వ్యూహాత్మక పోరాటం చేస్తోంది. చిన్న ఆయుధాలతోనే అమెరికా, దాని మిత్ర పక్షాలకు చెందిన అత్యంత విలువైన ఆస్తులపై దాడులు చేస్తూ.. వాటికి ఎక్కువ నష్టం జరిగేలా ప్లాన్ చేస్తోంది. తక్కువ ఖర్చుతో రూపొం దించిన షహీద్ డ్రోన్లతో దాడులు చేస్తున్న ఇరాన్.. శత్రువు ఆయుధ నిల్వలు తరిగిపోయేలా యుద్ధతంత్రం నడుపుతోంది.

# ధూమపానం ఒత్తిడిని తగ్గిస్తుందా?



అబ్బా ఒక్క సరిగరెట్ అన్ని టెన్షన్స్‌ను దూరం చేస్తుందని చాలా మంది చెబుతుంటారు. సిగరెట్ తాగడం వల్ల ఆరోగ్యం చెడిపోతుందని తెలిసినా ఈ అలవాటు మాత్రం జనాలు అస్సలూ మానరు. దీన్ని తాగడం వల్ల ఒత్తడి తగ్గుతుందని, మనస్సుకు హాయిగా అనిపిస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంత వరకు నిజం.. సిగరెట్ తాగడం వల్ల నిజంగానే ఒత్తిడి తగ్గుతుందా? పొగాకులో నికోటిన్ అనే రసాయనం ఉంటుంది, ఇది తేలికపాటి ఉద్దీపన, కొన్ని నిమిషాల పాటు ఉండే ఉపశమన అనుభూతిని కలిగిస్తుంది. ఈ నికోటిన్ శరీరం డోపమైన్ వంటి హార్మోన్ల విడుదల అవ్వడానికి సహాయపడుతుంది. ఇది మనస్సును సంతోషంగా ఉంచే హార్మోన్, ఈ హార్మోన్ శరీరంలో విడుదలైనప్పుడు, అది మిమ్మల్ని సంతోషంగా ఉంచుతుంది. అందుకే చాలా మంది సిగరెట్ తాగిన తర్వాత వారి ఒత్తిడి తగ్గుతుందని అనుకుంటారు. ఈ నికోటిన్ అనేది మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది, కానీ అది కొన్ని సెకన్ల నుండి నిమిషాల వరకు మాత్రమే ఉంటుంది. ధూమపానం మానసిక ఒత్తిడిని ఎప్పుడూ తగ్గించదు, కానీ కాలక్రమేణా, శరీరం నికోటిన్‌ను కోల్పోతున్నప్పుడు, అది విశ్రాంతి లేకపోవడం, చిరాకును పెంచుతుంది. శరీరంలో నికోటిన్ స్థాయిలు తగ్గినప్పుడు వారికి మళ్ళీ సిగరెట్ తాగాలి అనిపిస్తుంది. ఇది ఇలానే రిపీట్ అవ్వడం వల్ల ఒత్తిడిని మరింత పెంచుతుంది. ఇది కాలక్రమేన ఆందోళన, చిరాకు, నిద్రలేమి వంటి సమస్యలకు దారి తీస్తుంది. అలాగే ఎక్కువసేపు సిగరెట్ తాగే వారికి ఊపిరితిత్తుల వ్యాధి, శ్వాస ఆడకపోవడం, దగ్గు, క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొత్తంమీద, ధూమపానం ఒత్తిడి నుండి తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తుంది, కానీ దీర్ఘకాలంలో, ఇది మానసిక ఒత్తిడిని మరింత పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన అలవాట్లను అవలంబించడం ఎల్లప్పుడూ మెరుగైన, సురక్షితమైన ఎంపిక. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడానికి ధూమపానానికి కొన్ని ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు ఇక్కడ ఉన్నాయి. వ్యాయామం,యోగా: రోజూ యోగా లేదా వ్యాయామం చేయడం ద్వారా మీ శరీరంలో ఎండార్ఫిన్‌ల అనే హార్మోన్ విడుదల అవుతాయి. ఇవి మనస్సును ప్రశాంతంగా ఉంచుతాయి. మైండ్‌ఫుల్‌నెస్: ఇది మానసిక శాంతి, ప్రశాంతతను అందిస్తుంది, ఏకాగ్రతను పెంచుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం: చక్కెర, కెఫిన్ తీసుకోవడం నియంత్రించడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల మీ మానసిక స్థితి సమతుల్యంగా ఉంటుంది. ఇది మీ మన్సస్సును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. సామాజిక మద్దతు: ఒంటరిగా కూర్చుని సిగరెట్లు కాల్చే బదులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడండి. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.


# కరకరలాగే అప్పడాలు ఎలా వేయించుకోవాలి?



సాధారణంగా మనం అప్పడాలు, ఒడియాలు వెయించాలంటే ఏం చేస్తాం.ఒక బాండిలో ఫుల్‌గా నూనె పోసి దానిలో వెయిస్తాం.. కానీ చుక్క నూనె కూడా లేకుండా అప్పడాలను వెయించవచ్చు అంటు మీరు నమ్మతారా? కచ్చితంగా నమ్మాల్సిందే.. ఓ మాస్టర్ చెఫ్ చెప్పిన చిట్కాను యూజ్ చేస్తే.. చుక్క నేనె లేకుండా మనం వడియాలు, అప్పడాలు వెయించుకోవచ్చు. మన భారతీయల్లో చాలా మంది భోజనం చేసేప్పుడు పక్కకు నంచుకోవడానికి వడియాలు, అప్పడాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. పప్పు అన్నం, లేదా సాంబార్‌తో తినేప్పుడు ఈ అప్పడాల కాంబినేషన్ వేరె లెవల్‌గా రుచిని అందిస్తుంది. అయిపే ఈ అప్పడాలు వెయించేందుకు మనం సాధారణంగా అయిల్‌ను ఉపయోగిస్తాం. కానీ ప్రస్తుత రోజుల్లో అనారోగ్యం కారణంగా చాలా మంది నూనెకు దూరంగా ఉండాలని చూస్తున్నారు. అలాంటి వారి కోసమే మాస్టర్ చెఫ్ పంకజ్ బధోరియా అదిరిపోచే చిట్కాను తీసుకొచ్చారు. చుక్క నూనె కూడా లేకుండా మన వంటిట్లో లభించే ఉప్పుతో అప్పడాలను వేయించుకోవచ్చని ఆయన చెబుతున్నారు. ఇందుకోసం ముందుగా మనం ఒక మందమైన బాండి తీసుకొని దాన్ని స్టౌపై ఉంచి దానిలో కాస్త ఉప్పు పోయాలి. తర్వాత దాన్ని వేడి చేయాలి. ఉప్పు నుంచి వేడి అవిరి వచ్చిందంటే అది వెయించడానికి సిద్దమైనట్టు అర్థం. ఇక మీ ఇంట్లో ఒడియాలు, లేదా అప్పడాలు తెచ్చి ఉప్పులో వేసి గరిటతో కలపండి. ఆ ఉప్పు వేడికి అప్పడాలు ఉబ్బుతూ క్రిస్పీగా తయారవుతాయి. అప్పడాలు పూర్తిగా కాలేందుకు వాటిని పూర్తిగా ఉప్పులో మునిగేలా గరిటిలో కలుపుతూ ఉండడండి. అలాగే వాటిని తొగించేప్పుడు జాలి గంటెతో తీసుకేందుకు ప్రయత్నించండి. ఇలా చేయడం ద్వారా అప్పడాలకు ఉప్పు అంటుకోకుండా ఉంటుంది. అంతేకాదు మీకు బయట మార్కెట్‌లో దొరికే రంగురంగుల అప్పడాలను కూడా ఈ ఉప్పులో వెయించుకోవచ్చు. ఇవే కాదు నూనె లేకుండా అప్పడాలు వేయించుకునేందుకు మైక్రోవేవ్ ఓవెన్ కూడా బెస్ట్ ఆప్షన్. అప్పడాలు దేదా వడియాలను ఇందులో వేసి 'ఫ్రై' ఆప్షన్ పెట్టి సెట్ చేస్తే క్షణాల్లోనే మీకు అప్పడాలు రెడీ అవుతాయి. ఎయిర్ ఫ్రైయర్‌తో కూడా అయిల్ లేకుండా స్నాక్స్ చేసుకోవచ్చు. మీతో ఇవేవి లేవు అనుకుంటే ఉప్పు మీకు బెస్ట్ ఆప్షన్ అవుతంది.

# టూత్ బ్రష్ ఎన్ని రోజులకు మార్చుతున్నారు?

దాదాపు అందరికీ ఉదయం నిద్రలేవగానే, రాత్రి పడుకునే ముందు పళ్ళు తోముకునే అలవాటు ఉంటుంది. కానీ పళ్ళు తోముకోవడానికి ఉపయోగించే టూత్ బ్రష్‌ను ఎన్ని రోజులకు మార్చాలో? ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో? చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఏళ్లకే యేళ్లు ఒకే బ్రష్‌ను ఉపయోగిస్తుంటారు. ఇక్కడే సమస్య మొదలవుతుంది.. దంతవైద్యుల అభిప్రాయం ప్రకారం టూత్ బ్రష్‌లను సాధారణంగా ప్రతి 3 నుంచి 4 నెలలకు ఒకసారి మార్చాలి. అమెరికన్ డెంటల్ అసోసియేషన్‌తో సహా అనేక అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే విషయాన్ని సిఫార్సు చేస్తున్నాయి. ఎందుకంటే 3 నెలల తర్వాత బ్రష్ ముళ్ళగరికెలు మృదువుగా మారి వంగిపోతాయి. అప్పుడు అది దంతాల మధ్య పేరుకుపోయిన ఫలకాన్ని సరిగ్గా శుభ్రం చేయలేవు. ముళ్ళగరికెలు విస్తరించి ఉంటే లేదా బ్రష్ తల భాగం ఉబ్బి ఉంటే బ్రష్ దాని ప్రభావాన్ని కోల్పోయిందని గ్రహించాలి. దంతాల ఎనామిల్, చిగుళ్ళను రక్షించడంలో అరిగిపోయిన బ్రష్ గతంలో ఉన్నంత ప్రభావవంతంగా ఉండవని అధ్యయనాలు చెబుతున్నాయి. ఫలితంగా దంతాలపై ఫలకం పేరుకుపోతుంది. దీనివల్ల కావిటీస్, చిగురువాపు, రక్తస్రావం ప్రమాదం పెరుగుతుంది. మరో ముఖ్యమైన అంశం బ్యాక్టీరియా. మన నోటిలో సహజంగానే అనేక బ్యాక్టీరియా ఉంటుంది. బ్రష్‌ను ప్రతిసారి ఉపయోగించిన తర్వాత ఆ బ్యాక్టీరియాలో కొన్ని బ్రష్ ముళ్ళగరికెలపైనే ఉంటాయి. అది సరిగ్గా ఆరకపోతే అక్కడ బ్యాక్టీరియా పెరుగుతుంది. అందువల్ల బ్రష్‌ను ఉపయోగించిన తర్వాత దానిని బాగా కడిగి, బహిరంగ ప్రదేశంలో ఆరనివ్వాలని నిపుణులు అంటున్నారు. దానికి మూత పెట్టి తడిగా ఉంచడం మంచిది కాదు. జలుబు, వైరల్ జ్వరం, నోటి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుంటే మీరు కోలుకున్న వెంటనే మీ టూత్ బ్రష్‌ను మార్చాలని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే పాత బ్రష్‌లపై మిగిలి ఉన్న క్రిములు తిరిగి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదాన్ని కలిగిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలి. పిల్లలు తరచుగా గట్టిగా బ్రష్ చేస్తుంటారు. దీని వలన బ్రష్ త్వరగా అరిగిపోతాయి. కాబట్టి తల్లిదండ్రులు వారిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. ఈ చిన్న అలవాటును మార్చుకోవడం వల్ల పెద్ద సమస్యల నుంచి మిమ్మల్ని రక్షించుకోవచ్చు. ఖరీదైన టూత్‌పేస్ట్‌ని ఉపయోగించడం మాత్రమేకా? ప్రభావవంతమైన బ్రష్ కూడా అంతే ముఖ్యం. కాబట్టి ప్రతి 3 నెలలకు ఒకసారి మీ టూత్ బ్రష్‌ను మార్చండి.



# ఏం చేసినా మొటిమలు వస్తున్నాయా!



మారుతున్న లైఫ్‌స్టైల్, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక మంది అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందులో చర్మ సమస్యలు కూడా ఒకటి. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి మొటిమలు సాధారణ సమస్యగా మారిపోయాయి. కానీ ఈ సమస్య దీర్ఘకాలంగా ఉంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రస్తుతం జనాలు ఎదుర్కొంటున్న వర్క్ ప్రెజర్, అనారోగ్యమైన ఆహారం, రోజువారి అలవాట్ల కారణంగా చాలా మంది చర్మ సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట ఆలస్యంగా మేల్కొని ఉండటం, ఎక్కువ జంక్ ఫుడ్ తినడం, తక్కువ నీరు త్రాగడం, మానసిక ఒత్తిడి వంటి వివిధ కారణాలు చర్మ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. ఇటువంటి అలవాట్ల కారణంగా, ముఖంపై తరచుగా మొటిమలు కనిపిస్తాయి. ఇది యువకులు, స్త్రీలలో కనిపించే ఒక సాధారణ సమస్య, కానీ దానిని నెగ్లెట్ చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఎందుకంటే ఇది క్రమంగా చర్మం యొక్క సహజ కాంతిని తగ్గిస్తుంది. అంతే కాదు, ఇది మచ్చలకు కూడా దారితీస్తుంది. మాక్స్ హాస్పిటల్‌లోని చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సౌమ్య సచ్‌దేవా ప్రకారం, చర్మంపై మొటిమలు పెరగడానికి అనేక కారణాలు ఉండవచ్చు. వాటిలో ఒకటి హార్మోన్ల మార్పులు రావడం. ఇది తరచుగా ఋతుస్రావం, గర్భధారణ లేదా ఒత్తిడి వంటి సమయాల్లో వస్తుంది. ఇవే కాదు జంక్ ఫుడ్, ఎక్కవగా తీపి ఆహారాలు తినడం వల్ల కూడా మొటిమెలు వస్తాయి. అలాగే, ముఖాన్ని తరచుగా లేదా మురికి చేతులతో తాకడం వల్ల కూడా బ్యాక్టీరియా పెరుగుతుంది. దీని వల్ల మొటిమలు వస్తాయి. అంతేకాదు మేకప్‌ను సరిగ్గా తొలగించకపోవడం, జిడ్డుగల చర్మంపై క్రీములు రాయడం, నిద్ర లేకపోవడం ,తక్కువ నీరు త్రాగడం వల్ల కూడా మొటిమల సమస్య పెరుగుతుంది. కొంతమందిలో, జన్యుపరమైన కారణాల వల్ల కూడా మొటిమలు కనిపిస్తాయి. సాధారణంగా మొటిమలను నివారించడానికి, మొదట మీ దినచర్యను మార్చుకోవడం చాలా ముఖ్యం. ప్రతిరోజూ తేలికపాటి ఫేస్ వాష్‌తో మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం, మేకప్ ను పూర్తిగా శుభ్రం చేసుకోవడం ముఖ్యం.జంక్ ఫుడ్‌కు బదులు మీ రోజువారి ఆహారంలో ఆకుకూరలు, పండ్లను చేర్చుకోండి. అలాగే రోజుకు 3-4 లీటర్ల నీరు తాగడం అలవాటు చేసుకోండి. అలాగే ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. వీటిని క్రమం తప్పకుండా పాటించడం ద్వారా మీరు మొటిమల సమస్యలను తగ్గించుకోవచ్చు.

# పిల్లలకు నిద్ర ముఖ్యం ఎందుకు?



సాధారణంగా పిల్లలు తల్లిదం డ్రులను అనుకరిస్తారు. వారి నుంచే అన్నీ నేర్చుకుంటారు. ఒత్తిడిని ఎలా మేనేజ్ చేయాలి.. భావోద్వేగాలను ఎలా వ్యక్తపరచాలి..అనేవి మాత్రమే కాదు ఫోన్ వినియోగాన్ని కూడా నేర్చుకుంటున్నారు. దీనివల్ల పిల్లల నిద్ర దెబ్బతింటోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో స్క్రీన్ ఎక్స్‌పోజర్ మెలటోనిన్‌ను భంగపరుస్తుంది. స్లీప్ సైకిల్స్‌ను దెబ్బతీస్తుంది. నిజానికి నిద్ర అనేది జీవ విజ్ఞాన ప్రక్రియ. శారీరక అభివృద్ధి, బ్రెయిన్ డెవలప్మెంట్, ఎమోషనల్ మేనేజ్మెంట్‌తోపాటు పూర్తి ఆరోగ్యానికి అవసరం. సరైన పోషకాహారం, వ్యాక్సిన్స్ ఎంత ఇంపార్టెంటో తగినంత, నాణ్యమైన నిద్ర కూడా అంతే ముఖ్యం. కానీ మోడ్రన్ లైఫ్ స్టైల్ కారణంగా నిద్రను నిర్లక్ష్యం చేస్తున్నారు. పెద్దవాళ్లకు రోజుకు ఎనిమిది గంటల నిద్ర ముఖ్యమని నిపుణులు చెప్తున్నారు. అలాగే నవజాత శిశువులు, టాడ్లర్స్, ప్రీస్కూల్ చిల్డ్రెన్, స్కూల్ స్టూడెంట్స్‌కు ఎంత నిద్ర అవసరమో చెప్తున్నారు నిపుణులు. సాధారణ నిద్ర అనేది క్రమబద్ధంగా, వయస్సుకు తగిన విధంగా, రిఫ్రెష్ అయ్యేలా, అంతరాయం లేకుండా ఉండాలి. దీనివల్ల పిల్లలు ఉదయం చురుకుగా ఉంటారు. ఇందుకోసం తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. నిజానికి పేరెంట్స్ ఈ విషయంలో కీలకపాత్ర పోషిస్తారు. రోజు బెడ్‌టైమ్, మేల్కొనే సమయాన్ని క్రమం తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. స్నానం, స్టోరీస్ చెప్పడం, ప్రేయర్, సాఫ్ట్ మ్యూజిక్, ఇష్టమైన బొమ్మలు బ్లాంకెట్స్‌తో కంఫర్ట్ చేయడం వంటివి పడుకునే ముందు రొటీన్‌గా ఉండేలా చూసుకోవాలి. పడుకునే ఏరియా చీకటిగా, సైలెంట్‌గా, చల్లగా, కంఫర్ట్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పడుకునే సమయానికి కనీసం రెండు గంటల ముందు స్క్రీన్ ఎక్స్‌పోజర్ తగ్గిస్తే.. నిద్రకు ఆటంకం ఉండదు. ఇక పిల్లలు పగటిపూట శారీరకంగా అలసిపోవడం, సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ కావడాన్ని ప్రోత్సహిస్తే మంచిది. దీనికారణంగా వారు అలిసిపోయే ఎర్లీగా పడుకునే అవకాశం ఉంటుంది. ఇక బెడ్ టైమ్‌లో ఎక్కువగా తినడం, కెఫీన్ కలిగిన డ్రింక్స్ తీసుకోవడం మానేయాలి. ముఖ్యంగా రొటీన్ టైమ్ అనేది బాడీని అంతర్గత గడియారాన్ని బలోపేతం చేసేలా చేసి.. నిద్రకు ఉపక్రమించేలా శరీరాన్ని తయారు చేస్తుంది. నిద్ర పిల్లల అభివృద్ధిలో దాదాపు ప్రతి అంశంలో కీలక పాత్ర పోషిస్తుంది. డీప్ స్లీప్ సమయంలో గ్రోత్ హార్మోన్ స్రావం గరిష్టంగా ఉంటుంది. ఇది ఎత్తు, శారీరక వృద్ధిని ప్రభావితం చేస్తుంది. మెమరీ కన్సాలిడేషన్, న్యూరల్ కనెక్టివిటీకి నిద్ర అవసరం. దీని వల్లనే మెదడు అభివృద్ధి జరుగుతుంది. కొత్తగా నేర్చుకుంటారు. అంతేకాదు రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఇన్ఫెక్షన్ రిస్క్ తగ్గుతుంది. భావోద్వేగ నియంత్రణ మెరుగుపడుతుంది. చిరాకు, మూడ్ స్వింగ్స్ తగ్గుతాయి. మెటబాలిక్ ఆరోగ్యం రక్షించబడుతుంది. ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ రిస్క్ తగ్గుతుంది. దీర్ఘకాలంగా స్లీప్ డిస్టర్బెన్స ఉన్నట్లయితే పరిణామాలు కూడా అంతే తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు. పేలవమైన నిద్ర పిల్లల్లో ప్రవర్తనా సమస్యలకు దారితీస్తుందని చెప్తున్నారు. హైపర్ యాక్టివిటీ, శ్రద్ధ లేకపోవడం, చదువులో వెనుకబడిపోవడం, చిరాకు, దూకుడు, ఆందోళన, డిప్రెషన్ లక్షణాలు ఉంటాయి. సామాజిక సంబంధాలు కూడా తక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా టీనేజర్స్‌లో యాంటీసోషల్ బిహేవియర్, హింస, నేరాలకు పాల్పడటం, డ్రగ్స్ వినియోగం, రిస్క్ టేకింగ్ బిహేవియర్‌ను పెంచుతుంది. నైతికంగా ఆలోచించే శక్తిని దెబ్బతీస్తుంది.

# రేపు జరిగే టీ20 వరల్డ్ కప్ ఫైనల్ కు అంపైర్లు వీరే!

**టీ20 ప్రపంచకప్ ఫైనల్ అంపైర్లుగా ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్**

**వరుసగా రెండోసారి టీ20 ఫైనల్‌లో బాధ్యతలు చేపట్టనున్న ఇల్లింగ్‌వర్త్**

**తొలిసారి సీనియర్ వరల్డ్ కప్ ఫైనల్ అంపైర్‌గా అలెక్స్ వార్ఫ్**

**మ్యాచ్ రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్, థర్డ్ అంపైర్‌గా అల్లావుద్దీన్ పాలేకర్**

**హోమ్ గ్రౌండ్‌లో కప్పు కొట్టాలని సూర్యకుమార్ సేన పట్టుదల**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 తుది సమరానికి రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఈ ఆదివారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక ఫైనల్ మ్యాచ్‌కు ఐసీసీ అంపైర్లను ఖరారు చేసింది. ఈ మెగా ఫైట్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్‌కు అంపైర్‌గా ఇది వరుసగా రెండో టీ20 ప్రపంచకప్ ఫైనల్ కావడం విశేషం. 2024లో బార్బడోస్ వేదికగా టీమిండియా విజేతగా నిలిచిన ఫైనల్ మ్యాచ్‌లోనూ క్రిస్ గఫానీతో కలిసి ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా 2023 వన్డే వరల్డ్ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లోనూ ఆయన అంపైర్‌గా వ్యవహరించారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ పేసర్ అలెక్స్ వార్ఫ్‌కు సీనియర్ వరల్డ్ కప్ ఫైనల్‌లో అంపైరింగ్ చేయడం ఇదే తొలిసారి. కోల్‌కతాలో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ విజయం సాధించిన సెమీఫైనల్ మ్యాచ్‌లోనూ వీరిద్దరే అంపైర్లుగా ఉన్నారు. ఈ ఫైనల్ మ్యాచ్‌కు మ్యాచ్ రిఫరీగా జింబాబ్వేకు చెందిన ఆండీ పైక్రాఫ్ట్, థర్డ్ అంపైర్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన అల్లావుద్దీన్ పాలేకర్, ఫోర్త్ అంపైర్‌గా అడ్రియన్ హోల్డ్‌స్టాక్ వ్యవహరిస్తారు. పాలేకర్ ఈ టోర్నీలో ఇప్పటికే ఆరు మ్యాచ్‌లకు సేవలందించారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి, సొంతగడ్డపై కప్పు ఎత్తిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు మిచెల్ సాంట్నర్ కెప్టెన్సీలోని కివీస్ జట్టు తమ తొలి టీ20 వరల్డ్ కప్ టైటిల్ కోసం తహతహలాడుతోంది. సెమీస్‌లో ఫిన్ అలెన్ కేవలం 33 బంతుల్లోనే రికార్డు సెంచరీతో చెలరేగడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఆదివారం జరగనున్న ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దారుణంగా ఆడుతున్న అభిషేక్ శర్మ.. ఫైనల్లో తుది జట్టులో ఉంటాడా..?

**వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్న ఓపెనర్ అభిషేక్ శర్మ**

**ఫైనల్లో అభిషేక్ స్థానంలో రింకూ సింగ్‌ను తీసుకోవాలంటూ డిమాండ్**

**ఫామ్ లేని ప్లేయర్‌తో రిస్క్ చేయొద్దంటున్న నెటిజన్లు**

**ఆదివారం అహ్మదాబాద్ వేదికగా భారత్–న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026 తుది దశకు చేరుకుంది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్ పోరులో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. అయితే ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియా కూర్పుపై, ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ స్థానంపై తీవ్ర చర్చ నడుస్తోంది. టోర్నీ ఆసాంతం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో, ఫైనల్ కోసం అతన్ని కొనసాగించాలా? లేక డేరింగ్ నిర్ణయం తీసుకొని ఫినిషర్ రింకూ సింగ్‌ను జట్టులోకి తీసుకోవాలా? అనే ప్రశ్న ఇప్పుడు అభిమానులను, విశ్లేషకులను తొలుస్తోంది.ఈ టోర్నీలో అభిషేక్ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్ లలో అతను కేవలం 89 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో జింబాబ్వేపై చేసిన ఒక అర్ధసెంచరీ (55) మినహా.. మిగతా మ్యాచుల్లో 0, 0, 0, 15, 10, 9 స్కోర్లకే పరిమితమయ్యాడు. అతని సగటు కేవలం 12.71 మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో ఇలాంటి ఫామ్ లేని ఆటగాడిని నమ్ముకోవడం రిస్క్ అవుతుందని సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు."నిలకడగా విఫలమవుతున్న ఆటగాడితో ఫైనల్ మ్యాచ్‌లో ప్రయోగం చేయకూడదు. రింకూ సింగ్ వంటి మ్యాచ్ విన్నర్‌ను తీసుకోవాలి" అని ఒక అభిమాని కామెంట్ చేయగా, "అభిషేక్ ఆటతీరును ప్రత్యర్థులు పసిగట్టారు, కివీస్ బౌలర్లు అతన్ని సులభంగా కట్టడి చేస్తారు" అని మరొకరు విశ్లేషించారు. అయితే మరికొందరు మాత్రం అభిషేక్ ఫైనల్లో 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారతాడని, కీలక సమయంలో భారీ ఇన్నింగ్స్ ఆడతాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం కెప్టెన్ సూర్యకుమార్

యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ ముందు పెద్ద సవాల్ ఉంది. విన్నింగ్ కాంబినేషన్‌నే కొనసాగిస్తారా? లేక ట్రోఫీ కోసం కఠిన నిర్ణయం తీసుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. దాదాపుగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తున్నా, ఫైనల్ ఒత్తిడి దృష్ట్యా రింకూ సింగ్ పేరును పరిశీలించే అవకాశం లేకపోలేదు.

# వామ్మో.. ఫైనల్ మ్యాచ్ ఆ మోదీ స్టేడియంలోనా.. ఇండియా కష్టమే అంటూ రచ్చ రచ్చ !









**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 సెమీ ఫైనల్ మ్యాచ్?లో టీమిండియా గెలిచి ఫైనల్?కు వెళ్లినప్పటికీ అభిమానులను మాత్రం ఒక విషయం టెన్షన్ పెడుతోంది. అదే.. ఫైనల్ మ్యాచ్?కు అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదిక కావడం. ఈ స్టేడియం టీమిండియాకు అస్సలు కలిసి రావడం లేదని.. వేదిక మార్చాలని టీమిండియా అభిమానుల్లో కొందరు నెట్టింట డిమాండ్ చేస్తున్నారు. అయితే.. ఈ డిమాండ్లకు తలొగ్గే పరిస్థితి లేనప్పటికీ అహ్మదాబాద్ స్టేడియంపై అభిమానుల అసంతృప్తికి కారణం లేకపోలేదు. 2023 ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ వన్డే వరల్డ్ కప్ మ్యాచ్ ఇదే స్టేడియంలో జరిగింది. టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో 42 బంతులు మిగిలి ఉండగానే టీమిండియాను చిత్తు చేసి వరల్డ్ కప్ టైటిల్ గెలిచింది. ఈ మ్య?ాచ్ రిజల్ట్ గుర్తొచ్చినప్పుడల్లా.. ఆస్ట్రేలియా క్రికెటర్ ట్రావిస్ హెడ్ సృష్టించిన విధ్వంసం కళ్ల ముందు కదిలాడుతుంది. 137 పరుగులు చేసి ఎవరూ ఊహించని విధంగా టీమిండియాను

ఘోరంగా దెబ్బ తీశాడు. టీమిండియా ఇలా కప్ చేజార్చుకున్న మ్యాచ్ నరేంద్ర మోదీ స్టేడియంలోనే జరిగింది.అంతెందుకు.. మొన్నటికి మొన్న సూపర్–8లో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఓడిపోయిన మ్యాచ్?కు కూడా అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియమే వేదికగా నిలిచింది. ఇన్ని చేదు జ్ఞాపకాలకు సాక్ష్యంగా నిలిచిన స్టేడియం కావడంతో ఈ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ వద్దు బాబోయ్ అని టీమిండియా అభిమానులు సోషల్ మీడియా సాక్షిగా గగ్గోలు పెడుతున్నారు. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో ఫైనల్ జరిగితే టీమిండియా ఓడిపోతుందనే భయం కొందరు టీమిండియా అభిమానులను వెంటాడుతుంది.

# చైతూ ఇప్పటికి మెయిన్ గేమ్‌లోకి వచ్చాడా?



**ఆషికా రంగనాథ్ రీగల్ పర్పుల్ లెహంగా మ్యాజిక్**



టాలీవుడ్‌లో హీరోలకు కొదవలేదు. ఇతర ఇండస్ట్రీలతో పోలిస్తే మన దగ్గర హీరోలు చాలా మందే ఉన్నారు. ఇందులో స్టార్స్ కుటుంబాల వారసులు కూడా ఎక్కువే. అయితే చాలా వరకు స్టార్స్ ఫ్యామిలీ వారసుల్లో కొంత మంది ఇప్పటి వరకు వారికున్న యాక్టింగ్ ప్రొటెన్షియాలిటీకి తగ్గ సక్సెస్‌లని, ఆ స్థాయి కథలని..క్యారెక్టర్లని ఇంత వరకు చేయలేకపోతున్నావారు ఇద్దరు ముగ్గరున్నారు. వారిలో ముందు వరుసలో నిలుస్తున్నహీరో అక్కినేని నాగచైతన్య. అక్కినేని నాగార్జున వారసుడిగా అరంగేట్రం చేసినా ఇంత వరకు తన సత్తాకు తగ్గ క్యారెక్టర్, సినిమా చేయలేకపోతున్నాడు. అలాంటి కథల్ని ఎంచుకుని రేస్‌లో ముందుకు రాలేకపోతున్నాడు అనే భావన అక్కినేని అభిమానుల్లో గత కొంత కాలంగా వినిపిస్తూనే ఉంది. చైతూ ఫస్ట్ మూవీ –జోష్–. ఇందులో తను ప్రదర్శించిన నటన, చూపించిన హావభావాలు, ప్రదర్శించిన యాటిట్యూడ్ మరే సినిమాలో చూపించలేదు. ఫస్ట్ మూవీలోనే అనుభవం ఉన్న ఆర్టిస్ట్‌లా అన్ని వేరియేషన్స్ చూపించిన నాగచైతన్యలో మంచి నటుడు ఉన్నాడని ఫస్ట్ మూవీతో అందరికి అర్థమైంది. కానీ తనకు తగ్గ కథలని ఇప్పటి వరకు చేయలేదు నాగాచైతన్య. నటుడిగా, హీరోగా అతనికున్న ప్రొటెన్షియలిటీకి తగ్గ సినిమా చేస్తే చూడాలని గత కొన్నేళ్లుగా అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అది ఇప్పటికి నెరవేరబోతున్నట్టుగా తెలుస్తోంది. నాగచైతన్య నటిస్తున్న తాజా మూవీ –వృశకర్మ–. చైతూ నటిస్తున్న 24వ సినిమా ఇది. మీనాక్షీ చౌదరి కథానియికగా నటిస్తోంది. ఇదొక మిస్టికల్ యాక్షన్ థ్రిల్లర్. –విరూపాక్ష– ఫేమ్ కార్తిక్ దండు దర్శకుడు. ట్రెజర్ హంటర్‌గా నాగచైతన్య నటిస్తున్నాడు. ఈ మూవీ బడ్జెట్ రూ.120 కోట్లు. చైతూ కెరీర్‌లో ఈ స్థాయి భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఫస్ట్ మూవీ ఇది. తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. గత చిత్రాలకు భిన్నంగా చైతూ ఇందులో కనిపిస్తున్నాడు. కంటెంట్, క్యారెక్టర్ చాలా ఇంటెన్సిటీతో పవర్ ఫుల్‌గా సాగుతుదని తెలుస్తోంది. గ్లింప్స్ చూసిన తరువాత అక్కినేని అభిమానులు ఇది కదా నాగచైతన్య నుంచి ఇన్నాళ్లుగా కోరుకుంటోందని హ్యాపీ ఫీలవుతున్నారు. చైతూ మాత్రం అంతకు మించి చెబుతున్నాడు. తన కెరీర్‌ని మలుపు తిప్పే సినిమా ఇదని బాహాటంగానే చెబుతున్నాడు. ఈ మూవ్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నా.. నా కెరీర్‌లోనే ఇదొక బెస్ట్ మూవీ అవుతుందని గట్ ఫీలింగ్‌తో చెబుతుండగం గమనార్హం.గతంలో దేవ కట్టతో చేసిన –ఆటోనగర్ సూర్య– సినిమాతో నాగచైతన్య స్టార్ లీగ్‌లోకి ఎంటరవుతాడని అంతా భావించారు. దానికి సంబంధించిన డైలాగ్ టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేయడంతో అభిమానులు కూడా ఖుషీ అయ్యారు. కంటెంట్ మిస్‌ఫైర్ కావడం, రిలీజ్ డిలే కావడంతో ఆశించిన స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేకపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు –వృశకర్మ–తో అక్కినేని అభిమానులు ఎదురుచూస్తున్న కమర్షియల్ బ్లాక్ బస్టర్ చైతూకు రాబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చైతూ కూడా చాలా స్ట్రాంగ్‌గా చెబుతున్నాడు. ఈ సారి ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న కమర్షియల్ సక్సెస్ కొట్టేస్తామని..అంతా ఆశిస్తున్నట్టే –వృశకర్మ– బ్లాక్‌బస్టర్ హిట్ అయితే చైతూ కెరీర్ మరో మలుపు తిరగడం ఖాయం.



**రియా చక్రవర్తి సొగసైన రెడ్ శారీ లుక్‌లో స్టన్స్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965